
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



విశాఖపట్నం

జిల్లా వార్తలు

మంగళవారం 16 ఏప్రిల్ 2024

చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల పర్యటన వాయిదా

అనకాపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అనకాపల్లి జిల్లా పర్యటన వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం మంగళవారం చోడవరం, ఎలమంచిలి నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచార సభలు నిర్వహించాల్సివుంది. కానీ పవన్ కల్యాణ్ కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో బీజేపీ నేతలకు మద్దతుగా ప్రచారానికి వెళుతున్నందున పర్యటన వాయిదా పడినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మళ్లీ ఎప్పుడు అనేది త్వరలోనే ప్రకటిస్తామని నేతలు పేర్కొన్నారు.

బస్సెక్కితే బాదుడే



వైసీపీ పాలనలో రెండుసార్లు భారీగా ఆర్టీసీ చార్జీలు పెంపు

- 25 శాతం నుంచి 50 శాతం మేర వడ్డించిన సర్కారు
- పేద, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర ప్రభావం
- ఉమ్మడి జిల్లాలోని ప్రయాణికులపై నెలకు రూ.పది కోట్లు అదనపు భారం
- ఆక్యుపెన్సీ రేషియో తగ్గిందనే నెపంతో పలు ప్రాంతాలకు పేరుతో సర్వీసులు రద్దు
- వైసీపీ ప్రభుత్వ తీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

పేద, మధ్య తరగతి ప్రజల చైతన్యరథంగా పేరొందిన ఆర్టీసీ (పీటీడీ) బస్సుల్లో ప్రయాణం భారంగా పరిణమించింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన ఐదేళ్లలో రెండుసార్లు భారీగా టికెట్ చార్జీలను పెంచడంతో ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రయాణికులపై నెలకు సుమారు రూ.10 కోట్లు అదనపు భారం పడింది. 2019లో పోల్చితే సిటీబస్సుల నుంచి లగ్జరీ ఎక్స్‌ప్రెస్‌ల వరకు బస్సు టికెట్‌ల ధరలను 25శాతం నుంచి 50 శాతం వరకూ పెంచేయడంతో సగటు ప్రయాణికులు గగ్గోలుపెడుతున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వ తీరుపై తీవ్రఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

విశాఖ రీజియన్ పరిధిలో ఉమ్మడి విశాఖ జిల్లా పరిధలో సుమారు 1,063 బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. 256 రూట్లలో ప్రతిరోజూ 3.5 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చుతున్నాయి. వీటిద్వారా ఆర్టీసీకి రోజుకు సగటున రూ.1.35 కోట్లు ఆదాయం సమకూరుతోంది. రాష్ట్ర విభజన తర్వాత టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఆర్టీసీ చార్జీలను పెంచలేదు. కాగా 2019లో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీని ఆదాయవనరుగా మార్చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రెండుసార్లు భారీగా చార్జీలను పెంచారు. దీనివల్ల పేద, మధ్యతరగతి జనాలకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం

... మిగతా 6వ పేజీలో

విశాఖ నుంచి వివిధ ప్రాంతాలకు చార్జీల వివరాలు

ప్రాంతం	2019	2024
చోడవరం	రూ.55	రూ.75
నర్సీపట్నం	రూ.105	రూ.150
విజయనగరం	రూ.60	రూ.90
పార్వతీపురం	రూ.170	రూ.220
శ్రీకాకుళం	రూ.150	రూ.175
పాలకొండ	రూ.150	రూ.185
అనకాపల్లి	రూ.50	రూ.60
సబ్బవరం	రూ.30	రూ.40
కొత్తవలస	రూ.25	రూ.35
ఎలమంచిలి	రూ.60	రూ.85
సింహాచలం	రూ.20	రూ.30
గాజువాక	రూ.25	రూ.35
భీమిలి	రూ.30	రూ.45
కొమ్మాది	రూ.20	రూ.40
రైల్వేస్టేషన్- తగరపువలస	రూ.30	రూ.45
ఆర్టీసీ కాంప్లెక్స్- తగరపువలస	రూ.30	రూ.40
రైల్వేస్టేషన్-ఆరిలోవ	రూ.15	రూ.25

చార్జీలు తగ్గించాలి



నేను ఆరిలోవ హెల్త్‌సిటీ ఆస్పత్రిలో ఆయాగా పనిచేస్తున్నాను. ప్రతి రోజూ బస్సులోనే డ్యూటీకి వెళ్లి వస్తుంటాను. ఒక పక్క చార్జీ రూ.40 తీసుకుంటున్నారు. గతంలో రెండువైపులా రూ.40 సరిపోయేది. నెలకు రూ.600 చార్జీల రూపంలో అదనపు భారం పడడంతో ఆర్థికంగా ఇబ్బంది గా మారింది. పెంచిన బస్సు చార్జీలను తగ్గించాలి.

- గండిబోయిన లక్ష్మి, కొమ్మాది

సగం ఆదాయం చార్జీలకే



నేను, నా భర్త, మా అన్నయ్య అందరం పూర్ణామార్కెట్‌లో ఫ్యాన్సీ వ్యాపారం చేస్తాం. కొమ్మాది నుంచి బస్సులోనే వెళ్లి వస్తుంటాం. నెలావారీ పాస్ తీసుకునేవాళ్లం. పాస్ రేట్లు పెరిగిపోవడంతో ఒకేసారి డబ్బు పెట్టి కొనలేక రెండేళ్లుగా తీసుకోవడం లేదు. ఏరోజు చార్జీ ఆరోజే కట్టుకుని వెళ్లి వస్తున్నాం. గతంలో రూ.15 చార్జీ ఉంటే ఇప్పుడు రూ.35కి పెరిగిపోయింది. మాలాంటివారికి ఇది భారంగా మారింది.

- కేరళ కనక, కొమ్మాది

ఏలేరు పైపులైన్ హుళక్కే!

కాలువకు బదులుగా పైప్‌లైన్ నిర్మాణానికి జీవీఎంసీ యోచన

- నీటి వృథాను అరికట్టేందుకు ప్రయత్నాలు
- నగరంలో 2050 వరకూ తాగునీటికి ఇబ్బందులు లేకుండా ప్రతిపాదనలు
- ప్రాజెక్టు నిర్మాణానికి రూ.3,494 కోట్లు ఖర్చవుతుందని అంచనా
- మూడేళ్ల కిందట రాష్ట్ర ప్రభుత్వానికి డీపీఆర్ నివేదన
- ఇప్పటివరకు పట్టించుకోని జగన్ సర్కారు



నగరానికి నీటిని సరఫరా చేస్తున్న ఏలేరు కాలువ

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖను పరిపాలనా రాజధానిగా చేస్తున్నందున నగరంలో 2050 వరకూ తాగునీటికి ఇబ్బంది లేకుండా ఏలేరు పైప్‌లైన్ ప్రాజెక్టుకు జీవీఎంసీ ప్రతిపాదించింది. దీనిపై అంచనాలతోపాటు డీపీఆర్ తయారుచేసి పంపాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ఇంజనీరింగ్ అధికారులు సర్వేచేసి ప్రాజెక్టుకు రూ.3,494 కోట్లు అవసరమవుతుందని అంచనా వేసి, మూడేళ్ల కిందట ప్రభుత్వానికి డీపీఆర్ పంపించారు. అయితే ఇంతవరకూ ప్రాజెక్టుపై సర్కారు నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు.

విశాఖను పరిపాలన రాజధానిగా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం, భవిష్యత్తులో నగర జనాభా పెరుగుదలను దృష్టిలో పెట్టుకుని తాగునీటి వనరులను పెంచుకునేందుకు జీవీఎంసీ అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఏలేరు రిజర్వాయర్ నుంచి కాలువ ద్వారా నీటిని తరలిస్తున్న పద్ధతికి బదులుగా పైప్‌లైన్ వేసే ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చారు. ఏలేరు రిజర్వాయర్ నుంచి నగరానికి 160 కిలోమీటర్లు పొడవున పైప్‌లైన్ నిర్మించాలంటే సుమారు రూ.3,949 కోట్లు వరకూ ఖర్చవుతుందని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు అంచనా వేశారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే 600 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ పర్ డే) నీరు నగరానికి చేరుతుందని, ఇది 2050 వరకూ పెరిగే నగర జనాభా అవసరాలకు సరిపోతుందని పేర్కొంటూ డీపీఆర్ సిద్ధం చేశారు.

సర్కారు తీరుతో మూలకు...

ప్రస్తుతం నగరానికి తూర్పుగోదావరి జిల్లాలోని ఏలేరు రిజర్వాయర్, విజయనగరం జిల్లాలోని తాటిపూడి, దేవరాపల్లి మండలంలోని రైవాడ రిజర్వాయర్ నుంచి నీరందుతోంది. అయితే వీటి నుంచి నుంచి వ్యవసాయానికి కూడా నీటి కేటాయింపులు వుండడంతో వేసవిలో నీటి విడుదలకు సమస్యలు తలెత్తి నగరంలో నీటిసరఫరాపై ప్రభావం పడుతోంది. పైగా ఓపెన్ కెనాల్ ద్వారా నీరు ప్రవహించే సమయంలో ఎండవేడికి ఆవిరికావడం, కాలువ నుంచి నీటి చౌర్యం జరగడం, పైగా నీరంతా కలుషితం కావడం వంటివి చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ వనరులను సిద్ధం చేసుకునే క్రమంలో ఏలేరు నుంచి ప్రస్తుతం ఉన్న ఓపెన్ కెనాల్ స్థానంలో పైప్‌లైన్ ప్రాజెక్టు నిర్మించాలని భావించారు. దీనికి అవసరమయ్యే రూ.3,494 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న జల్‌శక్తి పథకం నుంచి 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి కొంత నిధులు,

... మిగతా 6వ పేజీలో

ఓటరు నమోదుకు 72,386 దరఖాస్తులు

- 49,083 మందికి కొత్తగా ఓటు హక్కు
- ఓటు బదిలీకి 17,180 దరఖాస్తులు



విశాఖపట్నం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జనవరి 22న తుది ఓటర్ల జాబితా విడుదల చేసిన తరువాత జిల్లాలో కొత్తగా ఓటుకోసం 72,386 మంది దరఖాస్తుచేసుకున్నారు. ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి సక్రమంగా ఉన్న 49,083 దరఖాస్తులను ఆమోదించి అధికారులు వారికి ఓటు హక్కు కల్పించారు. 12,761 దరఖాస్తులు తిరస్కరించగా మరో 10,542 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికలకు విడుదలైన షెడ్యూల్ మేరకు ఈనెల 18న రాష్ట్రం లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తారు. నోటిఫికేషన్ విడుదలకు నాలుగు రోజులు ముందు వరకు అంటే ఈ నెల 14వతేదీ రాత్రి వరకు కొత్తగా ఓటరుగా నమోదుకు అవకాశం కల్పించారు. అదే సమయంలో ఓటు బదిలీకి కూడా వీలు కల్పించడంతో జిల్లాలో 17,180 దరఖాస్తులు అందగా, వాటిలో సక్రమంగా ఉన్న 12,933 ఒక్లొను ఓటర్లు కోరుకున్న చోటకు బదిలీచేయగా 2,336 దరఖాస్తులు తిరస్కరించారు. 1,908 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. జిల్లాలో కొత్తగా ఓటరుగా నమోదుకు ఎక్కువగా విశాఖ తూర్పు నుంచి 17,252 దరఖాస్తులు రాగా అందులో 11,424 మందికి ఓటు హక్కు కల్పించారు. ఉత్తర నియోజకవర్గంలో 13,111 దరఖాస్తులందగా 8,703 మందికి, భీమిలిలో 10,170 దరఖాస్తులకు 7,131, గాజువాకలో 9,935 దరఖాస్తులకు 6,451, పెందుర్తిలో 7,691 దరఖాస్తులకు 5,641, విశాఖ దక్షిణలో 6,862 దరఖాస్తులు అందగా 5,266 మందికి ఓటు హక్కు కల్పించినట్టు అధికారులు వివరించారు.

జిల్లాకు ఇద్దరు డిప్యూటీ డీఈవోలు

విశాఖపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాల విభజన తరువాత ప్రతి రెవెన్యూ డివిజన్‌కు ఒక ఉప విద్యాశాఖాధికారి పోస్టు మంజూరైంది. ఇటీవల వరకు ఉప విద్యాశాఖాధికారిగా బాధ్యతలు నిర్వహించిన భీమునిపట్నం డైట్ లెక్చరర్ ఎ.గౌరీశంకరరావుకు పదోన్నతి లభించి శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేశారు. దీంతో డిప్యూటీ డీఈవో పోస్టు ఖాళీని భర్తీ చేయడానికి బదులుగా ప్రభుత్వ ఆదేశాల మేరకు డివిజన్‌కు ఒకర్ని నియమించాలని అధికారులు ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో విశాఖ డివిజన్‌కు పెందుర్తి ఎంఈవో సువర్ణ, భీమిలికి చినగదిలి ఎంఈవో రవీంద్రబాబు పేర్లను పాఠశాల విద్యాశాఖకు పంపారు.

చరిత్ర పుటల్లో... నేషనల్ హిస్టరీ పార్క్

నాలుగేళ్లయినా డీపీఆర్ పంపని ప్రభుత్వం

కేంద్రం రూ. 38.2 కోట్లు మంజూరు చేసినా నిర్లక్ష్యం

- సీఎం జగన్ చేతుల మీదుగానే శంకుస్థాపన
- ఇదీ విశాఖపై వైసీపీ సర్కారు ప్రేమ!

Andhra Pradesh Natural History Park Museum & Research Institute

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

విశాఖపట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటున్న వైసీసీ సర్కారు కీలక ప్రాజెక్టులపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. దీనికి ఉదాహరణ నేషనల్ హిస్టరీ పార్కు అధికారంలోకి వచ్చిన ఏడాదిలో దేశంలోనే మొదటిగా భీమిలి మండలంలో ఈ పార్కు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఏర్పాటుకు ప్రతిపాదించగా కేంద్రం నిధులు మంజూరుచేసింది. అయితే ఇప్పటికీ డీపీఆర్ పంపకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది.



నేషనల్ హిస్టరీ పార్క్ వద్ద ప్రదర్శనకు వుంచిన శిలాజాలు (ఫైల్)

విశాఖపట్టణాన్ని పరిపాలన రాజధానిని చేస్తున్నామని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తరచూ చెబుతుంటారు. ఎన్నో అభివృద్ధి పనులు చేశామని ప్రచారం చేసుకుంటున్నారు. కానీ అందులో అనేకం అవాస్తవాలే. ముఖ్యమంత్రిగా డిసెంబరు, 2019లోనే జిల్లాలో సుమారు రూ.1,250 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు జగన్ శంకుస్థాపనలు చేశారు. వాటిని ఏడాదిలోనే పూర్తిచేయాలని జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. ఇందులో 'నేషనల్ హిస్టరీ పార్కు' ఒకటి. దీనిని రూ.75 కోట్లతో నిర్మించాలని ప్రతిపాదించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చేపట్టే ప్రాజెక్ట్ కావడంతో మరిన్ని హంగులు జోడించి బడ్జెట్‌ను రూ.88.2 కోట్లకు చేర్చారు. దీంతో కేంద్రం తన వాటాగా రూ.38.2కోట్లు మంజూరుచేసింది. మిగిలిన రూ.50 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాలి. సీఎం చెప్పినట్టు 2020 నాటికి ఇది పూర్తి కావాలి. కానీ ఇప్పటికీ సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) కేంద్ర ప్రభుత్వానికి పంపలేదు. అతి ముఖ్యమైన ప్రాజెక్ట్ పరిస్థితే ఇలా ఉంటే.. విశాఖపై వారి ఆలోచన ఏమిటో అర్థమవుతోంది. పైగా దేశంలో మొదటి నేచురల్ హిస్టరీ పార్క్ ఇదే కావడం మరో విశేషం.

కాలుప్పాడలో 15 ఎకరాల కేటాయింపు

భీమిలి మండలం

... మిగతా 6వ పేజీలో

డిప్యూటీ సీఎంకు ఝలక్!

సొంత మండలం దేవరాపల్లిలో 'కిలపర్తి' కుటుంబం తిరుగుబాటు

- భాస్కరరావు సతీమణి రాజేశ్వరి ఎంపీపీ పదవికి రాజీనామా
- అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా ముత్యాలనాయుడు పేరును ప్రకటించిన వైసీపీ అధిష్ఠానం
- మాడుగుల ఎమ్మెల్యే టికెట్ ఆశించిన కిలపర్తి
- తన కుమార్తెకు టికెట్ ఇప్పించుకున్న డిప్యూటీ సీఎం
- అప్పటి నుంచి కిలపర్తి కుటుంబం అలక



జడ్పీ సీఈవోకు రాజీనామా పత్రం అందిస్తున్న దేవరాపల్లి ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, పక్కన ఆమె భర్త భాస్కరరావు

దేవరాపల్లి, ఏప్రిల్ 15: సాధారణ ఎన్నికల ముందు మాడుగుల నియోజకవర్గం లో అధికార వైసీపీలో నెలకొన్న అంతర్గత విభేదాలు, అసంతృప్తి ఒక్కసారిగా బయటపడ్డాయి. ఉప ముఖ్యమంత్రి, వైసీపీ అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి అయిన బూడి ముత్యాలనాయుడు సొంత మండలం దేవరాపల్లి మండల పరిషత్ అధ్యక్ష పదవికి ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి సోమవారం రాజీనామా చేయడం తీవ్ర సంచల నం రేపింది. తన భర్త, ఉప ముఖ్యమంత్రికి కుడి భుజంగా వున్న కిలపర్తి భాస్కరరావుతోపాటు జిల్లా పరిషత్ సీఈవోను కలిసి తన రాజీనామా పత్రాన్ని అందించారు. ఈ

... మిగతా 6వ పేజీలో

కేజీహెచ్‌లో నీటి కష్టాలు



కార్డియాలజీ విభాగంలో నీటి సరఫరా లేక వృథాగా ఫ్రిజ్

అనేక వార్డుల్లో రోగులకు అవస్థలు

- జీవీఎంసీ నుంచి అరకొర సరఫరా
- ప్రత్యామ్నాయంపై అధికారుల కసరత్తు
- రెండు బోరుబావుల ఏర్పాటుకు చర్యలు

విశాఖపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని కింగ్‌జార్జ్ ఆస్పత్రిలో తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. అనేక వార్డులకు, నర్సింగ్ విద్యార్థినుల హాస్టల్స్ కు నీటి సరఫరా కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సాధారణంగా కేజీహెచ్‌లోని వార్డులు, నర్సింగ్ కాలేజీ, హాస్టల్‌తో పాటు అధికారుల చాంబర్స్‌కు అవసరమయ్యే నీటిని జీవీఎంసీ సరఫరా చేస్తుంది. కేజీహెచ్‌లో రోజువారీ అవసరాలకు 500 కిలోలీటర్లు నీరు అవసరమవుతుంది. ఇందుకోసం ఐదు చోట్ల నీటిని నిల్వ చేసే సంపులున్నాయి. వీటికి రెండు మార్గాల్లో జీవీఎంసీ నీరు సరఫరా చేస్తుంది. అయితే గత కొద్దిరోజులుగా కేజీహెచ్‌కు ఒకవైపు నుంచి మాత్రమే జీవీఎంసీ నీటిని సరఫరా చేస్తోంది. దీంతో వార్డులు, నర్సింగ్ హాస్టల్స్‌లో విద్యార్థులకు సరఫరా కావడం లేదు. మొత్తంగా 300 కిలోలీటర్లకు మించి నీరు రాకపోవడంతో అనేకవార్డుల్లో ఉదయం 11 గంటల తరువాత సరఫరా కావడం లేదు. మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో వాష్‌రూమ్స్, ఇతర అవసరాలకు రోగులు అవస్థలు పడుతున్నారు. నీరు లేక టాయిలెట్లు శుభ్రం చేయకపోవడంతో అనేక వార్డుల్లో దుర్గంధం వ్యాపిస్తోందని రోగులు గగ్గోలు పెడుతున్నారు. అంతేకాకుండా అనేక వార్డుల్లో రోగులకు చల్లని నీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన ఫ్రిజ్‌లకు కూడా నీరు సరఫరా కావడం లేదు. తాగునీటి ఇబ్బందులను పలువురు రోగులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం లభించలేదని, దీంతో మార్కెట్‌లో సీసాలతో నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోందని చెబుతున్నారు. ప్రస్తుతం కేజీహెచ్‌లో నీటి ఇబ్బందుల దృష్ట్యా జీవీఎంసీ ట్యాంకర్లతో సరఫరా చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ అమలుకావడం లేదు.

ప్రత్యామ్నాయం దిశగా...

కేజీహెచ్‌లో నీటి అవసరాలను తీర్చడం కోసం పూర్తిగా జీవీఎంసీపైనే ఆధారపడుతున్నారు. ఏటా వేసవిలో నీటి కష్టాలు ఎదురవుతుండడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అధికారులు దృష్టిసారించారు. కేజీహెచ్‌లోని గ్రౌండ్ వాటర్‌ను వినియోగించుకు నేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం రెండు చోట్ల బోర్లు వేయాలని నిర్ణయించినట్టు ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మీతులసి పేర్కొన్నారు. సూపరింటెండెంట్ కార్యాలయం సమీపంలో ఒకటి, సీఎస్ఆర్ బ్లాక్ వద్ద మరో బోరు వేసేందుకు యత్నిస్తున్నామన్నారు.

టీడీపీలోకి మాజీ కార్పొరేటర్ పోలిపిల్లి జ్యోతి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

జగదాంబ కూడలి, ఏప్రిల్ 15: గ్రేటర్ 30వ వార్డు మాజీ కార్పొరేటర్ పోలిపిల్లి జ్యోతి టీడీపీలో చేరారు. గాజువాకలో ఆదివారం జరిగిన ప్రజాగళం సభకు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబును సీతంరాజు సుధాకర్‌తో కలిసి ఆమె ఆపార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన జ్యోతి కాంగ్రెస్ పార్టీ నుంచి కార్పొరేటర్‌గా పనిచేశారు. దక్షిణ మాజీ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాస్‌కు అత్యంత ఆప్తులుగా మెలిగారు. ఆ తర్వాత వైసీపీలో కొనసాగారు. దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ నిర్లక్ష వైఖరితో ఇటీవల ఆమె ఆ పార్టీకి రాజీనామా చేశారు.

స్విమ్మింగ్ పోటీల్లో విజేతలకు అభినందన



విజేతలను అభినందిస్తున్న కలెక్టర్

మహారాణిపేట, ఏప్రిల్ 15: ఓపెన్ పారా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్- 2024 పారా స్విమింగ్ చాంపియన్ షిప్‌లో గెలుపొం దినక్రీడాకారులను కలెక్టర్‌ఏ మల్లికార్జున అభినందించారు. బెంగళూరులో మార్చి 25 నుంచి 28 వరకు జరిగిన అంతర్జాతీయ పోటీలలో గెలుపొందిన భీమిలికి చెందిన బి. రవళి, ఎన్. దినేష్, అలాగే, గ్వాలియర్‌లో జరిగిన జాతీయ పారా స్విమింగ్ పోటీల్లో పాల్గొన్న సాయి నికిల్ గౌతమ్ , షేక్ కౌసిల్ సాహెల్‌లను కలెక్టర్ అభినందించారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 15: నిర్వహణ పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. చిన్నూరు, జీవీఎంసీ పాఠశాల, నారాయణ స్కూల్, వాగ్దేవి స్కూల్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు. తాటిచెట్లపాలెం సెక్షన్ 11కేవీ సం గం ఆఫీస్ ఫీడర్, రామాలయం ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. దాలిరాజు సూపర్ మార్కెట్ ఏరియా, జగ్గారావు బ్రిడ్జి, యలమంచిలి వారి వీధి, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, ఓల్డ్ పోస్టాఫీస రోడ్డు ఏరియా, మహారాణి పార్లర్ ఏరియా తదితర ప్రాంతవాసులు గమనించాలనికోరారు.

'ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపు అవశ్యం'

మద్దిపాలెం, ఏప్రిల్ 15: పారిశ్రామికంగా విశాఖ మరింత అభివృద్ధి చెందాలంటే ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపు అవశ్యమని పౌర , ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో ఇండియా కూటమి సీపీఐ అభ్యర్థి అత్తిలి విమలకు మద్దతుగా పలు ప్రజాసంఘాలు మద్దిపాలెంలో సమావేశం నిర్వహించారు.

కూటమి విజయంతోనే రాష్ట్రాభివృద్ధి



జ్యోతి థియేటర్ వద్ద ఓటర్లతో కలిసి టీ తాగుతున్న వంశీకృష్ణ



జనసేనలో చేరిన యువకులతో వంశీకృష్ణ, నాయకులు

▸▸ దక్షిణ నియోజకవర్గ జనసేన అభ్యర్థి వంశీ కృష్ణ

జ్ఞానాపురం, ఏప్రిల్ 15: జనసేన, బీజేపీ టీడీపీ కూటమి అభ్యర్థుల విజయంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని దక్షిణ నియోజకవర్గ జనసేన అభ్యర్థి వంశీకృష్ణ అన్నారు. సోమవారం జ్యోతి థియేటర్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా ఆయన పర్యటించారు. టీ దుకాణాల వద్ద, ఇతర వ్యాపారులతో మమేకయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ ఐదేళ్లపాలనలో రాష్ట్రంలో 20 ఏళ్ల వెనక్కి వెళ్లిపోయిందన్నారు. తిరిగి అభివృద్ధి సాధించాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. విశాఖ నగర అభివృదికి కట్టుబడి పనిచేస్తామన్నారు. వైసీపీ అధినేత, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎన్ని డ్రామాలు ఆడినా నేడు ప్రజలు నమ్మే స్థితిలో లేరని వంశీ అన్నారు. ఎన్నికల్లో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

41వార్డులో జనసేనలో భారీ చేరికలు

గ్రేటర్ 41వార్డు జ్ఞానాపురం, సబాస్టియన్ కాలనీ పలువురు, యువత మహిళలు జనసేన పార్టీలో చేరారు. వంశీ కృష్ణ నాయకత్వంపై విశ్వాసంతో వార్డులోని వార్డు జనసేన నాయకులు అంతోని శేఖర్ ఆధ్వర్యంలో 250 మందికి పైగా పార్టీలో చేరారు. వీరందరికీ కండువాలు వేసి వంశీకృష్ణ పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా వర్షాకాలంలో ఏటా ముంపునకు గురవుతున్న సెబాస్టియన్ కాలనీ సమస్య పరిష్కరించాలని కోరారు. గత పదేళ్లగా వార్డులో ఎమ్మెల్యే వాసుపల్లి ఏ మాత్రం అభివృద్ధి చేయలేదని వారు తెలిపారు. కార్యక్రమంలో వార్డు జనసేన నాయకులు గవర రమణ, ఆశాజ్యోతి, సునీత, విజయకుమార్, రామారావు, చక్కాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచకాలకు చరమగీతం పలకాలి

పూర్ణామార్కెట్: వైసీపీ ఆరాచక పాలనకు చరమగీతం పాడాలని కూటమి అభ్యర్థి వంశీ కృష్ణయాదవ్ పిలుపు నిచ్చారు. సోమవారం సాయంత్రం గ్రేటర్ 35వ వార్డు వెలంపేట పోస్టాఫీసు నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో దక్షిణం నుంచి పోటీ తన గుర్తు గ్లాస్, ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న శ్రీభరత్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. వంశీ కృష్ణకు పలు వీధుల్లో మహిళలు హారతుల పట్టారు. యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఏడీసీ పార్కుల సందర్శన



వాకర్స్‌తో మాట్లాడుతున్న ఏడీసీ విశ్వనాథన్

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 15: అక్కయ్యపాలెం నాలుగు లేన్ల రహదారి బస్టాప్ పక్కనే ఉన్న గ్రీన్ బెల్ట్‌లో ఏర్పాటు చేసిన పిల్లల పార్కు, ఓపెన్ జిమ్‌ను జీవీఎంసీ అదనపు కమిషనర్ (ఏడీసీ) కేఎస్ విశ్వనాథన్ సోమవారం సందర్శించారు. ఈ మేరకు పార్కులో వాకింగ్ చేస్తున్న వారు జిమ్ లో పరికరాలు సరిగ్గా పని చేయడం లేదని, ట్రాక్ ఎగుడుదిగుడుగా ఉం దని ఏడీసీ దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

ఎన్నికల విధులపై సమావేశం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 15: సెక్టోరల్ అధికారులు, ఎన్నికల సూపర్‌వైజర్, బూత్‌స్థాయి అధికారులతో ముస్లిం తాటిచెట్లపాలెంలోని షాదీ ఖానాలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ మేరకు 12డీ హోం ఓ టింగ్, పోస్టల్ బ్యాలెట్, ఎన్నికల విధులపై ఉత్తర నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.అఖిల, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహశీల్దార్ జి.శ్రీరామమూర్తి చర్చించారు.

వైసీపీ పాలనలో అన్ని రంగాలు నాశనం

▸▸ ఉత్తర నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు



ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు

మద్దిపాలెం, ఏప్రిల్ 15: రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నదే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి లక్ష్యమని ఉత్తర నియోజకవర్గ కూటమి అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు అన్నారు. సోమవారం 53వ వార్డు పరిధి శ్రీరామ్‌నగర్, నరేంద్రనగర్, పార్వతీనగర్, శివనగర్ తదితర కాలనీల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మా ట్లాడుతూ ప్రస్తుత వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి జర గలేదన్నారు. అన్ని రంగాలను సర్వనాశనం చేశారని ధ్వజమెత్తారు. పాలన సాగించడంలో విఫలమైందని ఈసందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈస్థితిలో టీడీపీ, జనసేన, బీజేపీలు ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పలుసంక్షేమ పథకాలు అమలు చేయడంతోపాటు పేద, బడుగు, బలహీనవర్గాల అభివృద్ధే ధ్యేయంగా పలు చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్లు మంచి ఆలోచనతో బాధ్యతాయుతంగా ఓటు వేయాలన్నారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పని చేసే చంద్రబాబునాయుడును, అంకితభావంతో శ్రమిస్తున్న పవన్‌కల్యాణ్‌ను, దేశ ప్రజల అభివృద్ధిని కాంక్షిస్తున్న ప్రధాని నరేంద్రమోదీలకు మద్దతుగా కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ విశాఖ పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ పొలమరశెట్టి నర్సకుమారి, జనసేన నాయకుడు రఘు, అధికసంఖ్యలో మూడు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ విజేతలు ఇంజనీరింగ్, సీ అండ్ డబ్ల్యూ



విజేతగా నిలిచిన మహిళల సివిల్ ఇంజనీరింగ్ జట్టు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఏప్రిల్ 15: వాల్తేరు రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ నిర్వహిస్తున్న స్పోర్ట్సు మేళా లో భాగంగా డివిజనల్ అం తర్ శాఖల వెయిట్ లిఫ్టింగ్ టోర్నీ మహిళల విభాగంలో సివిల్ ఇంజనీరింగ్, పురుషుల కేటగిరిలో క్యారేజ్ అండ్ వ్యాగన్స్ (సీ అండ్ డబ్ల్యూ) చాంపియన్లుగా నిలిచాయి. స్వర్ణ పతకాలు సాధించిన వారిని పలువురు అభినందించారు.

'యూసీడీ పీడీపై చర్యలు లేకపోవడం దారుణం'

సీతమ్మధార, ఏప్రిల్ 15: అనేక అవతకలకు పాల్పడుతున్న జీవీఎంసీ అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ (యూసీడీ) విభాగం పీడీ పాపునాయుడుపై చర్యలు తీసుకోకపోవడం దారుణమని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అన్నారు. ఆయన పౌర గ్రంథాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యూసీడీని వైసీపీ జేబు సంస్థగా మార్చి పరువు తీసిన పాపునాయుడుపై విచారణ జరిపిన అధికారులు అసలు దొంగను వదిలేసి కింది స్థాయి వారిని బలి చేశారన్నారు. ఎక్సైజ్ శాఖ నుంచి నిబంధలకు విరుద్ధంగా డిప్యుటేషన్‌పై జీవీఎంసీ యూసీడీ పీడీగా వచ్చిన పాపునాయుడు ఎన్నికల నిబంధనలను ఖాతరు చేయకుండా బరితెగించి వైసీపీ అభ్యర్థుల సేవల్లో మునిగి తేలుతున్నారన్నారు. దీనిపై ఫిర్యాదులు అందినా, నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ఉన్నతాధికారులు ఇంకా వైసీపీ నేతల ఒత్తిడికి లొంగి పాపునాయుడును కాపాడుతూ వస్తున్నారని ఆరోపించారు.

మంత్రి బొత్సకు 'అప్సా' ప్రతినిధులు వినతి

కంచరపాలెం, ఏప్రిల్ 15 : ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాల (అప్సా) ప్రతినిధులు విద్యాశాఖా మంత్రి బొత్ససత్యనారాయణను సోమవారం ఆయన నివాసంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. బదిలీ సర్టిఫికెట్, స్టడీసర్టిఫికెట్ లేకుండా ఎవరూ ఏ స్కూల్లో నైనా అడ్మిషన్ పొందవచ్చునని ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ ఇచ్చిన జీవో ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలకు నష్టం కలిగేవిధంగా ఉందని ఈసందర్భంగా ఆయన దృష్టికి తెచ్చారు. మంత్రి స్పందించి ఎవరికీ ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యాశాఖ మంత్రిని కలిసినవారిలో అప్సా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు కె.రామకృష్ణ, పి.భాస్కరరావుతో పాటు ఇతర ప్రతినిధులు ఉన్నారు.

మోసగించడంలో జగన్‌రెడ్డి ఘనుడు: గండిబాబ్జీ



ప్రచారం చేస్తున్న గండి బాబ్జీ

సీతమ్మధార, ఏప్రిల్ 15: ప్రజలను మోసగించడంతో ఘనుడు ముఖ్యమం త్రి జగన్‌రెడ్డి అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ విమర్శించారు. సోమవారం ఉత్తర నియోజకవర్గం బాలయ్య శాస్త్రి లే అవుట్ పరిసర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి లోక్‌సభ అభ్యర్థి శ్రీభరత్‌కు చెందిన సైకిల్‌పై, శాసనసభకి విష్ణుకుమార్ రాజు కమలం పూవు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. కూటమి అభ్యర్థుల విజయంతోనే సురక్షితమైన సాధ్యమన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతున్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే విష్ణుకుమార్‌రాజు, శ్రీభరత్‌లను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక, కార్పొరేటర్ ముక్కా శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు- గువాహటి ప్రత్యేక రైలు

విశాఖపట్నం, ఏప్రిల్ 15: వేసవి ప్రయాణికుల సౌకర్యార్థం వయా దువ్వాడ మీదుగా బెంగళూరు, గువాహటి మధ్య ప్రత్యేక రైలు ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. 06521 నంబరు గల రైలు ఈనెల 16 నుంచి జూన్ 25 వరకు ప్రతి మంగళవారం రాత్రి 11.40 గంటలకు బెంగళూరులో బయలుదేరి మర్నాడు సాయంత్రం 6.18 గంటలకు దువ్వాడ, శుక్రవారం ఉదయం 4.50 గంటలకు గుహవటి చేరుతుంది. తిరిగి రైలు ఈనెల 20 నుంచి జూన్ 29 వరకు ప్రతి శనివారం ఉదయం 6.15 గంటలకు గుహవటిలో బయలుదేరి ఆదివారం మధ్యాహ్నం 3.08 గంటలకు దువ్వాడ, సోమవారం ఉదయం 10.55 గంటలకు బెంగళూరు చేరుతుంది.

నవ్వులే..నవ్వులు!

▸▸ నేడు ప్రపంచ ప్రఖ్యాత హాస్యనటులు చార్లీచాప్లిన్ జయంతి

▸▸ నగరంలో ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రదర్శనలు



సైలెన్స్ ప్లీజ్ స్కిట్‌లో...నవ్వులు..పూయిస్తున్న నటులు



చాప్లిన్ వేషధారణలో సుబ్రహ్మణ్యం

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 15: అతను నవ్వుకు శాశ్వత చిరునామా. దర్శకుడు, నిర్మాత, విశ్వ విఖ్యాత నటుడు చార్లీ చాప్లిన్‌పై ఇలా ఎన్ని విశేషణాలు చెప్పినా తక్కువే.. పేదరికాన్ని పరిహాసం చేసి...నవ్వునేఆయుధంగా మలచిన ధీరుడు చార్లీ చాప్లిన్ 135వ జయంతి నేడు. ఈ సందర్భంగా ఆయన స్ఫూర్తితో హాస్యాన్ని పండిస్తున్న నగరానికి ఫ్రెండ్స్ కామెడీ క్లబ్‌పై కథనం..

నవ్వు నాలుగు విధాల మేలు అన్న సూక్తిని.. బలంగా నమ్మే వ్యక్తి...నగరానికి చెందిన విశ్రాంత బ్యాంకు మేనేజర్ ఎంవీ సుబ్రహ్మణ్యం. తనతోపాటు తనచుట్టూ ఉన్న ప్రతీ ఒక్కరూ కాసేపైనా... హాయిగా నవ్వుకునేలా ఏదైనా చేయాలని సంకల్పించారు. ఇందులో భాగంగా ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ పేరుతో దశాబ్ద కాలానికి పైగా రెండు వేలకుపైగా వివిధ ప్రదర్శనలిచ్చారు. విశాఖపట్నం, గోదావరిఖని, కరీంనగర్ , హైదరాబాద్ తదతర ప్రాంతాల్లో ప్రేక్షకులను తన నటనా ప్రతిభతో నవ్విస్తూ వస్తున్నారు. ఈ క్లబ్ ద్వారా హాస్యనాటికలు, చిన్న చిన్న స్కిట్స్..ప్రదర్శిస్తున్నారు. వీటిలో ప్రధానమైనవి..సైలెన్స్ ప్లీజ్..కవితా..ఐపీఎస్..సాంకేతిక లోపం..చార్లీచాప్లిన్ పాటిజివ్, సూపర్‌క్లాప్..ఊరికనే..ఏటీఎం..తదితర వాటి ఉన్నాయి..

ఆ స్కిట్స్‌కు సూటయ్యేలా.. వేషధారణ

సుబ్రహ్మణం..కేవలం స్కిట్స్ వేసి..ప్రేక్షకులను నవ్వించడమే కాకుండా ఆ స్కిట్‌కు తగ్గట్టుగా మేకప్ కావడం ఆయన ప్రత్యేకత. ఆయా స్కిట్స్‌కు సరిపడేలా...ఆయనతో పాటు బృందసభ్యులను తయారు చేసి మరింత రక్తికట్టించి ప్రదర్శన విజయవంతమయ్యేలా కృషి చేస్తూ ప్రేక్షకుల మన్ననలు పొందుతున్నారు.

ఔత్సాహిక కళాకారుల ప్రతిభ వెలికితీయడమే లక్ష్యం..

▸▸ ఎంవీ సుబ్రహ్మణ్యం...

ఔత్సాహిక కళాకారులను వెలికితీయేడం.. ప్రదర్శనల ద్వారా ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడమే నా ధ్యేయం.. ఇది ఎంతో కష్టమైనప్పటికీ ఆ దిశగా సాగాను. కాశీ విశ్వనాథ్‌తో చర్చించి 2012 లో ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ నెలకొల్పాను. అప్పటి నుంచి ప్రతి నెలా ప్రదర్శనలు ఇస్తున్నాం. వృత్తిరీత్యా రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ కావడంతో ప్రదర్శనలకుఅయ్యే ఖర్చులన్నీ నేను భర్తిస్తున్నా. కళాకారులను జనానికి పరిచయం చేయడం. హాస్యగుళికలను అందించంలో ఎంతో సంతృప్తిఉంది.

బస్సెక్కితే బాదుడే

... 5వ పేజీ తరువాయి

భారంగా పరిణమించింది. ఆదాయమే పరమావధిగా జగన్ ప్రభుత్వం చార్జీలను భారీగా పెంచడంతో వారిపై అదనపు భారం పడింది. నగర పరిధిలోని వివిధ రూట్లలో తిరిగే సిటీబస్సులతోపాటు ఉత్తరాంధ్రలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రూట్లలో తిరిగే ఎక్స్‌ప్రెస్, లగ్జరీ బస్సుల చార్జీలను 2019తో పోల్చితే 25 శాతం నుంచి గరిష్ఠంగా 50 శాతం వరకూ పెంచారు.

ప్రయాణికులపై భారం ఇలా...

ద్వారకాబస్‌స్టేషన్ నుంచి చోడవరం ప్రయాణానికి 2019 లో చార్జీ రూ. 55 ఉండగా ఇప్పుడు రూ.75, నర్సీపట్నానికి 2019లో రూ.105 ఉండగా ప్రస్తుతం రూ.150, విజయనగరానికి 2019లో రూ.60 ఉంటే ప్రస్తుతం రూ.90, పార్వతీపురానికి రూ.170 ఉంటే ప్రస్తుతం రూ.220, శ్రీకాకుళానికి రూ.150 ఉంటే ప్రస్తుతం రూ.175, పాలకొండకి రూ.150 నుంచి రూ.185కి, అనకాపల్లికి రూ.50నుంచి రూ.60, సబ్బవరం రూ.30 నుంచి రూ.40, కొత్తవలస రూ. 25 నుంచి రూ. 35, ఎలమంచిలి రూ.60 నుంచి రూ.85కి పెరిగిపోయాయి.

నగర వాసులపైనా వడ్డన

నగర పరిధిలో సింహాచలం వరకు 2019లో రూ.20 చార్జీ ఉండగా ప్రస్తుతం రూ.30, గాజువాకకి రూ.25 నుంచి రూ.35కి, భీమిలికి రూ.30 ఉంటే ప్రస్తుతం రూ.45 , కొమ్మాదికి రూ.20 నుంచి రూ.40, విశాఖ రైల్వేస్టేషన్ నుంచి తగరపువలస రూ.30 నుంచి రూ.45కి పెంచేశారు. దీనివల్ల ప్రయాణికులపై రూ.పది కోట్లు అదనపు భారం పడిందని అంచనా.

పెంపుపై సామాన్యుల ఆగ్రహం

ఆర్టీసీ బస్సు చార్జీలను ఐదేళ్లలో రెండుసార్లు ఏకంగా 50 శాతం మేరకు పెంచడంపై సామాన్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూలీలు, ప్రైవేటు ఉద్యోగులు, స్వయంసహాయక వృత్తుల్లో ఉన్నవారంతా అద్దెలు తక్కువగా ఉంటాయనే భావనతో నగర శివారు ప్రాంతాల్లో నివసిస్తారు. వారంతా పనుల కోసం నగరానికి నిత్యం బస్సుల్లోనే వచ్చిపోతుంటారు. వచ్చే కూలీ/ వేతనంలో చార్జీలకే ఎక్కువ మొత్తం కేటాయించాల్సిన పరిస్థితి ఎదురవుతోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పైగా ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) తక్కువగా ఉందనే కారణంతో పలు రూట్లలో బస్సులను రద్దుచేస్తున్నారని, దీనివల్ల ఆయా ప్రాంతాల వారికి ఆటోలే శరణ్యమవుతున్నాయంటున్నారు. ఆర్టీసీ చార్జీలను పెంచి ఆదాయం సమకూర్చుకోవాలనే వైసీపీ సర్కారు తీరును వారంతా తూర్పారబడుతున్నారు.

ఏలేరు పైప్‌లైన్ హుళక్కే!

... 5వ పేజీ తరువాయి

ప్రపంచబ్యాంకుతోపాటు ఇతర బ్యాంకుల నుంచి రుణాల ద్వారా మరిన్ని నిధులు సమకూర్చుకునేలా డీపీఆర్ తయారుచేసి మూడేళ్ల కిందట రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం లభించిన తరువాత టెండర్లు పిలుస్తామని అప్పటి జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ జి.లక్ష్మీషా ప్రకటించారు.

మూడేళ్లైనా అతీగతీ లేదు...

మూడేళ్లయినా ప్రాజెక్టుపై ఒక్క అడుగుకూడా ముందుకు పడలేదు. రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్‌ను ఆమోదిస్తున్నట్టుగానీ, సవరించాలని వెనక్కిపంపడం కానీ జరగలేదు. ఉద్యోగులకు ప్రతినెలా నిర్ణీత సమయానికి జీతాలు ఇవ్వడానికే ఆపసోపాలు పడుతున్న ప్రభుత్వం జీవీఎంసీలో నీటిసరఫరా మెరుగుపరిచేందుకు ఏకంగా రూ.3,494 కోట్లు వెచ్చిస్తుందంటే అధికారులు ఎలా నమ్మారని జీవీఎంసీకి చెందిన కొంతమంది సిబ్బందే ప్రశ్నిస్తుండడంతో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కే అవకాశాలే లేవని తేల్చి చెబుతోంది.

డిప్యూటీ సీఎంకు ఝలక్!

... 5వ పేజీ తరువాయి

పరిణామం వైసీపీకి షాక్‌గా భావిస్తున్నారు.

కిలపర్తి భాస్కరరావు తండ్రి కిలపర్తి సూరి అప్పారావు నియోజకవర్గంలో కీలకనేత. మాడుగుల అసెంబ్లీకి గతంలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేశారు. ఆయన మరణం తరువాత భాస్కరరావు రాజకీయాల్లోకి వచ్చారు. వైసీపీ తరఫున దేవరాపల్లి ఎంపీపీగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో గట్టి పట్టున్న ఆయన.. కొద్దికాలంగా డిప్యూటీ సీఎంతో అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. వైసీపీ అధిష్ఠానం తొలుత బూడి ముత్యాల నాయుడుకు మాడుగుల అసెంబ్లీ టికెట్ కేటాయించింది. అనకాపల్లి నుంచిబీజేపీకి చెందిన సీఎం రమేశ్ బరిలో దిగడంతో.. బూడిని ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో మాడుగుల ఎమ్మెల్యే టికెట్ తనకు లభిస్తుందని కిలపర్తి భాస్కరరావు భావించినట్టు తెలిసింది. అయితే అనూహ్యంగా బూడి కుమార్తె ఈర్లె అనూరాధకు కేటాయించడంతో భాస్కరరావు తీవ్ర నిరాశ చెందారు. అంతకు ముందు వరకు ఉప ముఖ్యమంత్రి దేవరాపల్లి మండలంలో ఏగ్రామంలో పర్యటించినా భాస్కరరావు వెంట వుండేవారు. మాడుగుల టికెట్‌ను అనూరాధకు కేటాయించినప్పటి నుంచి కనిపించడంలేదు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా వుంటున్నారు. డిప్యూటీ సీఎం ఫోన్ చేసినా ఎత్తడంలేదని తెలిసింది. భాస్కరరావు పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేలా డిప్యూటీ సీఎం ప్రయత్నాలు చేసినప్పటికీ, స్పందన లేదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కిలపర్తి భాస్కరరావు వ్యవహారంపై ఆదివారం రాత్రి మండలానికి చెందిన పార్టీ ముఖ్యనేతలతో డిప్యూటీ సీఎం బూడి ప్రత్యేక సమావేశం నిర్వహించినట్టు సమాచారం. భాస్కరరావును బుజ్జగించే ప్రసక్తే లేదని, అతనికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చినా తనను మోసగించారంటూ డిప్యూటీ సీఎం వ్యాఖ్యానించినట్టు చెబుతున్నారు. అతనితో తెగతెంపులు చేసుకుంటామని స్పష్టం చేసినట్టు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న కిలపర్తి భాస్కరరావు, తన భార్య రాజేశ్వరిని వెం టబెట్టుకుని సోమవారం విశాఖ వెళ్లి జడ్పీ సీఈవో ఎం.పోలినా యుడును కలిశారు. రాజేశ్వరి ఎంపీపీ పదవికి రాజీనామా చేస్తూ, లేఖను ఆయనకు అంద జేశా రు. ఆరోగ్యం సహకరించక రాజీనామా చేస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. కాగా ఎంపీటీసీ పదవికి, వైసీపీకి రాజీనామా చేయలేదని భాస్కరరావు, రాజేశ్వరి చెప్పారు.

చరిత్ర పుటల్లో... నేషనల్ హిస్టరీ పార్క్

... 5వ పేజీ తరువాయి

కాపులుప్పాడలో నేషనల్ హిస్టరీ పార్కు కోసం 15 ఎకరాల భూమిని కేటాయించారు. దీనికి ఏపీ నేచురల్ హిస్టరీ పార్క్ అండ్ మ్యూజియం(ఎన్‌హెచ్‌పీఎం) అని నామకరణం చేశారు. ఆ మార్గంలో బోర్డు కూడా పెట్టారు. దీని నిర్మాణ బాధ్యతలను 'నేచురల్ హిస్టరీ సొసైటీ ఆఫ్ ఇండియా'కు అప్పగించారు. ప్రాజెక్ట్ మంజూరైన వెంటనే శాస్త్రవేత్తలు ఎక్కడెక్కడి నుంచో అరుదైన రాళ్ల (శిలాజాలు)ను తీసుకువచ్చి ప్రదర్శనకు పెట్టారు. దేశంలో విభిన్న ప్రాంతాలు, వాతావరణాల్లో పెరిగే మొక్కలు, అడవుల్లో లభించే వృక్షాలు, సముద్రాల్లో దొరికే శిలాజాలు, పర్వత శ్రేణుల్లో కనిపించే జీవరాశులు, ఎడారుల్లో అరుదుగా కనిపించే చెట్లను ఇక్కడ పెట్టాలనేది ధ్యేయం. విద్యార్థులకు విజ్ఞానాన్ని పంచేదిగా, కొత్త ఆలోచనలు రేకెత్తించేలా తీర్చిదిద్దాలనే సంకల్పంతో పనులకు శ్రీకారం చుట్టారు. విశాఖపట్నానికి ఇది పర్యాటక పరంగా అదనపు ఆకర్షణ అవుతుందని భావించారు.

లోగో తయారీకి పోటీ...

ప్రకృతికి, చరిత్రను ముడిపెడుతూ దేశంలో ఏర్పాటవుతున్న తొలి మ్యూజియం కావడంతో దీనికి లోగో తయారు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం పత్రికల్లో ప్రకటన ఇచ్చి డిజైన్లు ఆహ్వానించారు. 'ఆంధ్రప్రదేశ్ నేషనల్ హిస్టరీ పార్క్, మ్యూజియం అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఏపీఎన్‌హెచ్‌పీ ఎంఅండ్‌ఆర్‌ఐ)ను తలపిస్తూ అర్థవంతంగా ఉండేలా డిజైన్ కావాలని కోరారు. వివిధ రాష్ట్రాల నుంచి 127 డిజైన్లు రాగా వాటిని ఆంధ్ర విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ విభాగానికి పంపి ఎంపిక చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఆర్ట్ డైరెక్టర్ రమేశ్ రూపొందించిన డిజైన్‌ను లోగోగా ఎంపిక చేశారు.

పార్కులో 65 మిలియన్ సంవత్సరాల నాటి డైనోసార్‌ల నుంచి ప్రపంచంలో వింతైన జంతువుల వరకు అన్నింటి నమూనాలు పెట్టి ఎవల్యూషన్ పార్క్‌గా మార్చాలనుకున్నారు. సీతాకోక చిలుకలు సహజ వాతావరణంలో జీవించేలా ఎన్‌క్లోజర్లు ఏర్పాటు చేసి, 25 రకాలు పెంచాలని భావించారు. పదివేల సంవత్సరాల నాటి సముద్ర జలరాశులకు చెందిన శిలాజాలు, దేశంలో వివిధ గనుల నుంచి విలువైన స్టోన్స్, క్రిస్టల్స్, మినరల్స్ తేవాలని నిర్ణయించారు. అరుదైన ఔషధ మొక్కలు, సువాసనలు వెదజల్లే పుష్పాలు, ఆర్కిడ్స్ వేయాలనుకున్నారు. కృత్రిమ జలాశయాన్ని ఏర్పాటు చేసి, రమణీయంగా తీర్చిదిద్దాలని ప్లాన్ చేశారు. మ్యూజియంలో ప్రత్యేకంగా గ్యాలరీలు పెట్టి, ఆడియో, వీడియో ద్వారా వాటిపై అవగాహన కల్పించాలనుకున్నారు. విద్యుత్‌ను ఎన్ని రకాలుగా తయారు చేస్తారో.. ప్రాక్టికల్‌గా చూపించాలనుకున్నారు. కానీ ఒక్కటీ రూపుదాల్చలేదు.

ట్రస్ట్‌బోర్డులో చర్చించాకే నిర్ణయం

పార్క్‌కు సంబంధించి వీఎంఆర్‌డీఏ తరఫున డీపీఆర్ రూపొందించి, రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాం. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఎన్‌హెచ్‌పీఎం ట్రస్టు బోర్డులో దీనిపై చర్చించి గ్రీన్‌సిగ్నల్ లభించాకే కేంద్ర ప్రభుత్వానికి పంపాల్సి ఉంటుంది. అయితే ఇంకా ట్రస్టుబోర్డు సమావేశం కాలేదు. ఎప్పుడైతే అప్పుడు పంపుతామని వీఎంఆర్‌డీఏ అధికారి తెలిపారు.



దీక్షా శిబిరంలో నాయకులు, కార్మికులు

స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే పురోభివృద్ధి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 15: స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే పురోభివృద్ధి సాధిస్తుందని, అలాంటి కల్పతరువైన ప్రభుత్వ రంగ సంస్థను ప్రైవేటీకరణ చేయాలన్న దుర్బుద్ధి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి కలగడం అవివేకమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1,159వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిందాల్, టాటా వంటి బడా సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటు స్టీల్‌ప్లాంట్‌ను ఇబ్బందులలోకి నెడుతుండడం దారుణమన్నారు. కర్మాగారంలో పూర్తి స్థాయి ఉత్పత్తి చేయకుండా నష్టాల్లోకి నెడుతుండడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్లాంట్‌ను సెయిల్‌లోనైనా విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఉక్కు పరిరక్షణ కోసం పోరాటాలను మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

'బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం'

గాజువాక, ఏప్రిల్ 15: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ విశాఖ పార్లమెంటు ఉపాధ్యక్షుడు దీనంకొండ కృష్ణంరాజు అన్నారు. సోమవారం ఆయన గాజువాకలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వైసీపీ ప్రభుత్వం తమవిగా ప్రచారం చేసుకోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.పావని, పి.సంతోష్‌కుమార్‌రాజు, పి.వరలక్ష్మి, జీఎల్ నాయుడు, వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, ఏప్రిల్ 15: వరాహలక్ష్మీనృసింహ స్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా నిత్య కల్యాణాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు జరిపి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా కల్యాణాన్ని జరిపారు.

సీతారాముల కల్యాణానికి పెళ్లిరాట



వేపగుంటలో పందిరిరాట వేస్తున్న కార్పొరేటర్లు

వేపగుంట, ఏప్రిల్ 15: వేపగుంట రామాలయంలో శ్రీరామ నవమి పురస్కరించుకుని పెళ్లిరాట ఉత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పెళ్లిరాట ఉత్సవంలో కార్పొరేటర్లు ముమ్మన దేముడు, బల్ల శ్రీనివాసరావు పాల్గొని పూజలు చేశారు. ప్రహ్లాదపురం కోదండ రామాలయంలోనూ పెళ్లిరాట ఉత్సవం నిర్వహించారు.

సినిమా గైడ్

- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** గోకుల్, శ్రీకన్య, మౌర్య (గోపాలపట్నం) హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), దుర్గ (మధురవాడ)
- **లవ్ గురు :** శారద, సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
- **శ్రీరంగనీతులు** : కిన్నెర, శ్రీ నరసింహ (గోపాలపట్నం),
- **ది ఫ్యామిలీ స్టార్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), శ్రీకన్య-1, హెవెన్, సీతారామయ్య (పరవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి),
- **టిల్లు స్క్వేర్ :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి,
- **భరతనాట్యం :** రమాదేవి, లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస), సుకన్య (గోపాలపట్నం)
- **ప్రేమలు :** వెంకటేశ్వర, లీలామహల్

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 22, టమాటా 18, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 26, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 30, బీరకాయలు 36, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 26, క్యాబేజ్ 26, క్యారెట్ 30, దొండకాయలు 20, బంగాళా దుంపలు 27, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 30, అల్లం (పాతది) 155, బరబటి 26, ముల్లంగి 16,నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 28, దోస కాయలు 14, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 50, ఆగాకర 110, పొటల్స్ 68, కీరదోస 20, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 30, చిలగడదుంపలు 30, కంద 60, దేముడు చిక్కుడు 62, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 45, బూడిద గుమ్మడి కాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	419
విజయనగరం	423
శ్రీకాకుళం	423

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	105
ఫారం ధర	--	125
విత్ స్కిన్	--	220
స్కిన్‌లెస్	--	230

మరికొన్ని సిటీ వార్తలు పేజీ[లో..



గోతులతో నిండిన ఆటోనగర్ 'డి' బ్లాక్ రోడ్డు



గుంతలమయంగా ఉన్న 'బి' బ్లాక్ రహదారి

గోతులమయంగా ఆటోనగర్ రోడ్లు

'బి, 'డి' బ్లాక్‌లలోని రహదారులపై రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆటోనగర్, ఏప్రిల్ 15: ఆటోనగర్‌లోని 'బి', 'డి' బ్లాక్‌లలోని రహదారులు అధ్వానంగా మారాయి. ఎక్కడికక్కడ గోతులు ఏర్పడడంతో ఆయా రహదారుల్లో ప్రయాణం నరకయాతనగా ఉంటుందని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోతులమయమైన రోడ్లపై నిత్యం రాకపోకలు సాగిస్తుండడంతో తరచూ తమ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. ఆటోనగర్ పారిశ్రామికంగా వ్యాపార కేంద్రంగా ఉండడంతో వివిధ ప్రాంతాల నుంచి వందలాది భారీ వాహనాలు 'బి', 'డి' రహదారుల మీదుగానే రోజూ రాకపోకలు సాగిస్తుండడంతో



గోతులతో నిండిన 'బి', 'డి' బ్లాక్‌లలోని రోడ్లు



రోడ్లు ఛిద్రంగా మారాయి. గోతులమయంగా మారిన ఈ మార్గాల గుండానే రోజూ వివిధ కళాశాలల విద్యార్థులు, వీఎస్ఈజెడ్‌తో పాటు పలు పరిశ్రమల ఉద్యోగులు, కార్మికులు, గ్రీన్ సిటీ, దువ్వాడ, పకీరుతక్యా యాదవజగ్గరాజు పేట, సత్తివానిపాలెం, నరవ, గవర జగ్గయ్యపాలెం, పీలానగర్ ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు ద్విచక్ర వాహనదారులు నానాపాట్లు పడుతున్నారు. రాత్రిపూట ఈ రహదారుల్లో ప్రయాణం మరింత ఇబ్బందికరంగా ఉంటుందని, గోతుల మూలంగా ఇప్పటికే పలు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఇక్కడి రహదారులు ఇంత అధ్వానంగా ఉన్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని పలువురు వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆయా రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజాగళం సక్సెస్‌తో వైసీపీలో వణుకు

టీడీపీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు



66వ వార్డులో ప్రచారం సాగిస్తున్న పల్లా శ్రీనివాసరావు, తదితరులు

గాజువాక, ఏప్రిల్ 15: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదివారం గాజువాకలో నిర్వహించిన ప్రజాగళం సభ విజయవంతం కావడంతో వైసీపీలో వణుకు మొదలైందని నియోజకవర్గ 'దేశం' అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం 66వ వార్డులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ చంద్రబాబు సభకు అతి తక్కువ సమయంలోనే వేలాది ప్రజలు తరలిరావడం హర్షణీయమన్నారు. వైసీపీ పాలనతో విసిగిపోయిన ప్రజలకు అతి త్వరలోనే మంచి రోజులు రానున్నాయన్నారు.వైసీపీ పాలనలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరన్నారు. గాజువాక నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి చంద్రబాబు సంపూర్ణ హామీ ఇచ్చారని, అందరూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనతో పాటు విశాఖ ఎంపీ అభ్యర్థిగా శ్రీభరత్‌ను గెలిపించవలసిందిగా ఆయన కోరారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించడంతో పాటు నిర్వాసితులకు ఉపాధి కల్పిస్తామని, గంగవరం పోర్టు కార్మికులు, నిర్వాసితులకు న్యాయం చేస్తామన్నారు. గాజువాకలో కుంటుపడిన అభివృద్ధిని మళ్లీ పరుగులు పెట్టిస్తామని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గడిచిన ఐదేళ్ల కాలంలో గాజువాక గురించి పట్టించుకోని గుడివాడ అమర్‌నాథ్‌కు ప్రజలను ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. ప్రజా సంక్షేమంపై పోరాడుతున్న కూటమికి విజయాన్ని అందించేందుకు ప్రతిఒక్కరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, జనసేన గాజువాక ఇన్‌చార్జి కోన తాతారావు, నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, గోమాడ వాసు, మహ్మద్ ముర్తజీ, చెరుకూరి నాగేశ్వరరావు, పవన్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా 64వ వార్డులో పల్లా శ్రీనివాసరావు ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దల్లి గోవింద్, నాయకులు హరికృష్ణ,పోలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఆస్పత్రి జంక్షన్‌లో చలి వేంద్రం ప్రారంభం

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 15: స్టీల్‌ప్లాంట్ ఉక్కు ఆస్పత్రి జంక్షన్ వద్ద సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం వీఎంఎస్ అధ్యక్షురాలు నపూర్‌భట్ ప్రారంభించారు. గత 31 ఏళ్లుగా ఏటా చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని, జూన్ 15 వరకు దీనిని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సమితి జిల్లా అధ్యక్షుడు నాయుడు, పలువురు ఉక్కు అధికారులు, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

వుడా నగర్‌లో మజ్జిగ చలి వేంద్రం..

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు పరిధి వుడా నగర్‌లో మాటూరి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని మునిసిపల్ చైర్మన్ వీవీఎస్ఎం రాజా, నాయకులు దామా సుబ్బారావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండలు దారెత్తిస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఉపయుక్తంగా ఉండేలా ఈ చలి కేంద్రాన్ని ట్రస్టు నిర్వాహకులు మాటూరి శ్రీనివాసరావు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు ఎం.రత్నకుమారి, గాలి ఆనంద్, బి.నాగేశ్వరరావు, మెడికల్ బాబు, రామచంద్రరాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న ఆడారి ఆనంద్‌కుమార్, అభ్యర్థి బొత్స ఝాన్సీ, తదితరులు



58వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న రమాకుమారి

ఒక్క అవకాశమిస్తే.. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

▸ వైసీపీ పశ్చిమ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం, ఏప్రిల్ 15: ఎన్నికల్లో తనకు ఒక్క అవకాశమిచ్చి గెలిపిస్తే పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ కోరారు. నగర పరిధి 89వ వార్డు కొత్తపాలెంలో ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీతో పాటు ఆనంద్ కుమార్ ఎన్నికల ప్రచారాన్ని సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయదుర్గాదేవి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గత ఏడాదిగా ప్రతి సచివాలయం పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ఆయా ప్రాంతాల ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు అయి తంసెట్టి రేణుకా గోపి, పీఏసీఎస్ అధ్యక్షుడు ఆళ్ల పైడిరాజు, స్థానిక నేతలు దొడ్డి కిరణ్ వార్డు వైసీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీదే గెలుపు: ఎలమంచి మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

మల్కాపురం: పశ్చిమ నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆనంద్‌కుమార్ సోదరి ఎలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి కోరారు. 58వ వార్డులో ఆమె సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీలు ఎన్ని కుట్రలు చేసినా, వైసీపీని ఓడించలేరన్నారు. తది విజయం వైసీపీదేనని అన్నారు. జగన్ పాలనలో ప్రజలందరికీ ఎటువంటి లంచాలు లేకుండా సంక్షేమ పథకాలు అందించారన్నారు. దుష్టచతుష్టయం ఎన్ని ఆరోపణలుచేసినా, జగనన్నకు అండగా ఉంటామని ప్రజలు చెబుతుండడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య, మండల యువజన విభాగం అధ్యక్షులు బర్రి సంతోష్, మండల క్లస్టర్ అధ్యక్షులు అంగ రామ్‌ప్రసాద్, జేసీఎస్ కన్వీనర్ పిల్లా కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ పాలనంతా మోసమే..'



ఎన్నికల ప్రచారం చేస్తున్న గణబాబు

మల్కాపురం, ఏప్రిల్ 15: గ్రేటర్ 58వ వార్డు శ్రీహరిపురం ప్రాంతంలో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థి పీజీవీఆర్ నాయుడు (గణబాబు) సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆ యన ప్రజలతో మాట్లాడుతూ, వైసీపీ పాలనంతా మోసాలమయమేనన్నారు. ఈ స్థితిలో జగన్‌ను ఇంటికి పంపించాన్నారు. టీడీపీతో రాష్ట్రానికి మంచి జరుగుతుందని అన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా భరత్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, జిల్లా నాయకులు కాకిపోలిరెడ్డి, సుందరరావు, జనసేన సమన్వయకర్త అంగ దుర్గాప్రశాంతితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ బూత్ కన్వీనర్లు ఎన్నికల ప్రచారం

మల్కాపురం, ఏప్రిల్ 15 : పారిశ్రామిక ప్రాంతం ఏడు వార్డుల్లో వైసీపీ బూత్ కన్వీనర్లు ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. రోజూ ఉదయం, సాయంత్రం ఇంటింటా ప్రచారం చేపట్టడంతోపాటు ఓటర్ల జాబితాలను పరిశీలిస్తూ ప్రజలను కలుస్తున్నారు. ప్రభుత్వం ఐదేళ్లపాలనలో అమలుచేసిన సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. వీటిని పశ్చిమ నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకు వెళ్తున్నారు.

ఎండ ప్రచండం



ఎన్.ఎ.డి ఫ్లైఓవర్‌పై మధ్యాహ్నం రెండు గంటల సమయంలో అంతంతమాత్రంగా వాహనాల రాకపోకలు

ఎన్.ఎ.డి.జంక్షన్, ఏప్రిల్ 15: నగరంలో నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఎన్.ఎ.డి. జంక్షన్ ఎండలకు నిర్మానుష్యంగా మారుతోంది. సోమవారం మధ్యాహ్నం ఉష్ణోగ్రతలతోపాటు వడగాడ్పులు అధికంగా ఉండటం తో వాహనదారులతోపాటు, పాదచారుల సంచారం ఈ జంక్షన్‌లో తక్కువగా కనిపించింది. ఎండనుంచి ఉపశమనానికి వాహనాలనుఫ్లైఓవర్ కింద పార్కింగ్ చేసి సేదతీరున్నారు. ఎండలకు వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతున్నాయని స్థానిక వ్యాపారులు వాపోతున్నారు.

నామినేషన్ల స్వీకరణకు పక్కా ఏర్పాట్లు: ఈఆర్వో

పెందుర్తి, ఏప్రిల్ 15: పెందుర్తి నియోజకవర్గానికి సంబంధించి స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు యంత్రాంగం సిద్ధమైంది. ఈసందర్భంగా ఈఆర్వో శేషశైలజ సోమవారం ఎన్నికల సిబ్బందికి అవగాహన కల్పించారు. అలాగే, కార్యాలయ ప్రాంగణంలో నామినేషన్స్ సహాయక కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఇందులో నామినేషన్ల దాఖలు చేసే సమయంలో అభ్యర్థుల సందేహాల నివృత్తి చేయనున్నారు. నామినేషన్ల కేంద్రం నుంచి 100 మీటర్ల వరకు నిషిద్ధ ప్రదేశంగా గుర్తిస్తూ బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. అభ్యర్థి నామినేషన్లు దఖలు చేసే సమయంలో మీడియాను ఛాంబర్‌లోనికి అనుమతించమని ఈఆర్వో శేషశైలజ ఈ సందర్భంగా సూచించారు.

ఎమ్మెల్యే అభ్యర్థి పాటు నలుగురికే అనుమతి

ఈఆర్వో శేషశైలజ అభ్యర్థులు నామినేషన్లు వేసినప్పుడు ఎన్నికల నిబంధనలు తప్పకపాటించాలని ఈ సందర్భంగా ఆదేశించారు. సెలవు రోజులు మినహాయించి ఈనెల 18వ తేదీ నుంచి 25వతేదీ వరకునామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్ కేంద్రం వంద మీటర్లు దూరం వరకు మూడు వాహనాలకే అనుమతి ఉందన్నారు. శాసనసభకు పోటీ చేసే అభ్యర్థి ఎన్నికల ఖర్చు రూ. 40 లక్షలని పేర్కొన్నారు. అభ్యర్థులు ఖర్చుకు వివరాలు తెలి పేందుకు మూడు రిజిస్టర్లు అందజేస్తామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థులు రూ. 10వేలు ధరావతు కింద చెల్లించాలని, అదే ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు రూ 5వేలు చెల్లించాలన్నారు. నామినేషన్ దఖలు చేసిన చివరి రోజున నిర్ణీత సమయంలో పార్టీలు జారీ చేసిన బీఫాంలు అందజేయాలన్నారు.



సూచలందిస్తున్న ఈఆర్వో శేషశైలజ



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కాకి గోవిందరెడ్డి, తదితరులు

కుంచుమాంబ ఉత్సవాల వాల్ పోస్టర్లు ఆవిష్కరణ

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 15: తుంగ్లాం కాలనీలో ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే కుంచుమాంబ అమ్మవారి పండుగకు సంబంధించిన వాల్ పోస్టర్లను సోమవారం 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24న అమ్మవారి పుట్ట బంగారం సేకరణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, మే రెండున అమ్మవారి అనుపోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా తొమ్మిది రోజుల పాటు ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు కొల్లి అప్పలరెడ్డి, వాకాడ రామిరెడ్డి, ఎన్.సింహాచలం, పి.అర్జున్, ఎస్.అచ్చిబాబు, వి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును సీఎంను చేయడమే లక్ష్యం కావాలి

86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 15: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే మనందరి లక్ష్యం కావాలని ఆ పార్టీ 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ అన్నారు. మాతృశ్రీనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రజాగళం సభను విజయవంతం చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబు సభలో వైసీపీ మూకలు రాళ్లు విసయడం పిరికిపంద చర్యన్నారు. మంగళవారం ఎన్టీఆర్ జంక్షన్ కూడలి నుంచి గాజువాక టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు, తదితరులతో చేపట్టనున్న పాదయాత్రను అందరూ విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు మాడిశ కనకరాజు, వేగుంట శ్రీనివాస్, గణపతి, జగదీశ్, రుక్మిణి, బుజ్జమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి బుద్ధి చెప్పాలని ఇంటింటికీ వెళ్లి ప్రచారం

అగనంపూడి: వైసీపీ అరాచక పాలనకు ప్రజలంతా ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ కోరారు. వార్డు పరిధిలో సోమవారం టీడీపీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి విశాఖ ఎంపీ శ్రీభరత్‌ను, గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాసరావును గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కరణం సత్యారావు, కె.జగదీశ్, జి.వెంకటరావు, భవానీ, ఎస్.సింహాచలం ఎం.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఉత్సవాలకు ఉడుపు రాట

అగనంపూడి, ఏప్రిల్ 15: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక రామాలయం వద్ద ఈ నెల 17న శ్రీరామనవమి సందర్భంగా ఉత్సవాలకు శ్రీకారం చుడుతూ సోమవారం ఉడుపు రాట వేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రత్యేక పూజలు చేశారు. 17న సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు వి.చిరురాజు, కొలిపాక అప్పారావు, జి.అప్పారావు, గజేంద్రరావు, వి.నారాయణరావు, పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక కార్యక్రమం వాయిదా

అగనంపూడి, ఏప్రిల్ 15: ఏపీ ఈపీడీసీఎల్ లంకెలపాలెం సెక్షన్ కార్యాలయం పరిధి పెదముషిడివాడ 33/11 కేవీ సబ్ స్టేషన్ వద్ద మంగళవారం జరగవలసిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్టు ఈఈ ఎస్.రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కస్టమర్ గ్రీవెన్స్ రెసిడెన్షియల్ ఫోరం (సీజీఆర్ఎఫ్) ప్రతినిధులతో చర్చించి ఈ కార్యక్రమం ఎప్పుడు జరిగేది తేదీని త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులందరూ ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

దుకాణాలపై వైసీపీ జెండాలు తొలగించాలి

▸ ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్



జెండాలు కట్టిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

గోపాలపట్నం, ఏప్రిల్ 15: స్థానిక బంక్ కూడలిలోని తాటిపూడి పైప్‌లైన్‌పైన ఉన్న దుకాణాలపై వైసీపీ జెండాలు ఏర్పాటుపై ఈసీకి ఫిర్యాదు అందడంతో ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్ ఈ ప్రాంతాన్ని సోమవారం పరిశీలించారు. ఇటీవల గోపాలపట్నం ప్రధాన రహదారిలో కొందరు టీడీపీ సానుభూతిపరులు తమ వ్యాపార సముదాయాలపై టీడీపీ జెండాలు కట్టారు. దీంతో స్థానిక బంక్ కూడలిలోని తాటిపూడి పైప్‌లైన్‌పై నిర్మించిన దుకాణాలపై వైసీపీ నేతలు జెండాలు ప్రదర్శింప జేస్తున్నారు. అయితే ఎన్నికల నియమావళి ప్రకారం ప్రభుత్వ స్థలాల్లోని నిర్మాణాలపై పార్టీ జెండాలు కట్టడం నిషేధం. దీంతో ఈ వ్యవహారం ఈసీకి చేరింది. ఈ మేర ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ ఈ ప్రాంతాన్ని పరిశీంచారు. ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసుకున్న దుకాణాలపై ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా జెండాలు కట్టడంపై దుకాణ యజమానులను ప్రశ్నించారు. తక్షణమే జెండాలు తొలగించాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో ఆర్డీవో తో పాటు జడ్సీ హేమవతి, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు. అయితే ఆర్డీవో ఆదేశాలు జారీ చేసినా జెండాలు తొలగించక పోవడం చర్చాంశనీయంగా మారింది.

లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలి

▸ పాడేరు ఐటీడీఏ పీఓ అభిషేక్



విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో అభిషేక్

వేపగుంట, ఏప్రిల్ 15: విద్యార్థులు తమ లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలని పాడేరు ఐటీడీఏ పీఓ వి.అభిషేక్ సూచించారు. వేపగుంట ఐటీడీఏ వైటీసీలో సోమవారం మిషన్ ఏకలవ్యలో భాగంగా మెయిన్స్ పరీక్షకు అర్హత సాధించిన గిరిజన విద్యార్థులకు ఉచిత సివిల్స్ శిక్షణ తరగతులకు సంబంధించిన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అందరిలానే గిరిజన విద్యార్థులూ సివిల్స్‌లో ర్యాంకు సాధించాలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్, ఇతర సామాజిక మాధ్యమాల జోలికివెళ్లకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రణాళిక ప్రకారం సబ్జెక్టులను రివిజన్ చేయటమే కాకుండా వాటిని పూర్తిస్థాయిలో అవగాహన చేసుకుని చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునన్నారు. ప్రస్తుతం ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ముకేశ్ కుమార్ మీనాను ప్రతీ విద్యార్థీ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అధికారి ఎల్.రజని, సెంచురి ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్‌పర్సన్, ఇతర ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి మాజీ కార్పొరేటర్ పోలిపిల్లి జ్యోతి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

జగదాంబ కూడలి, ఏప్రిల్ 15: గ్రేటర్ 30వ వార్డు మాజీ కార్పొరేటర్ పోలిపిల్లి జ్యోతి టీడీపీలో చేరారు. గాజువాకలో ఆదివారం జరిగిన ప్రజాగళం సభకు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబును సీతంరాజు సుధాకర్‌తో కలిసి ఆమె ఆపార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన జ్యోతి కాంగ్రెస్ పార్టీ నుంచి కార్పొరేటర్‌గా పనిచేశారు. దక్షిణ మాజీ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాస్‌కు అత్యంత ఆప్తులుగా మెలిగారు. ఆ తర్వాత వైసీపీలో కొనసాగారు. దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ నిర్లక్ష వైఖరితో ఇటీవల ఆమె ఆ పార్టీకి రాజీనామా చేశారు.

స్విమ్మింగ్ పోటీల్లో విజేతలకు అభినందన



విజేతలను అభినందిస్తున్న కలెక్టర్

మహరాణిపేట, ఏప్రిల్ 15: ఓపెన్ పారా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్- 2024 పారా స్విమింగ్ చాంపియన్ షిప్‌లో గెలుపొం దినక్రీడాకారులను కలెక్టర్ఏ మల్లికార్జున అభినందించారు. బెంగళూరులో మార్చి 25 నుంచి 28 వరకు జరిగిన అంతర్జాతీయ పోటీలలో గెలుపొందిన భీమిలికి చెందిన బి. రవళి, ఎన్. దినేష్, అలాగే, గ్వాలియర్‌లో జరిగిన జాతీయ పారా స్విమింగ్ పోటీల్లో పాల్గొన్న సాయి నికిల్ గౌతమ్ , షేక్ కౌసిల్ సాహెల్‌లను కలెక్టర్ అభినందించారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 15: నిర్వహణ పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. చిన్నూరు, జీవీఎంసీ పాఠశాల, నారాయణ స్కూల్, వాగ్దేవి స్కూల్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు. తాటిచెట్లపాలెం సెక్షన్ 11కేవీ నం గం ఆఫీస్ ఫీడర్, రామాలయం ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. దాలిరాజు సూపర్ మార్కెట్ ఏరియా, జగ్గారావు బ్రిడ్జి, యలమంచిలి వారి వీధి, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, ఓల్డ్ పోస్టాఫీస రోడ్డు ఏరియా, మహరాణి పార్లర్ ఏరియా తదితర ప్రాంతవాసులు గమనించాలనికోరారు.

'ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపు అవశ్యం'

మర్రిపాలెం, ఏప్రిల్ 15: పారిశ్రామికంగా విశాఖ మరింత అభివృద్ధి చెందాలంటే ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపు అవశ్యమని పౌర , ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో ఇండియా కూటమి సీపీఐ అభ్యర్థి అత్తిలి విమలకు మద్దతుగా పలు ప్రజాసంఘాలు మర్రిపాలెంలో సమావేశం నిర్వహించారు.



జ్యోతి థియేటర్ వద్ద ఓటర్లతో కలిసి టీ తాగుతున్న వంశీకృష్ణ



జనసేనలో చేరిన యువకులతో వంశీకృష్ణ, నాయకులు

కూటమి విజయంతోనే రాష్ట్రాభివృద్ధి

▸▸ దక్షిణ నియోజకవర్గ జనసేన అభ్యర్థి వంశీ కృష్ణ

జ్ఞానాపురం, ఏప్రిల్ 15: జనసేన, బీజేపీ టీడీపీ కూటమి అభ్యర్థుల విజయంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని దక్షిణ నియోజకవర్గ జనసేన అభ్యర్థి వంశీకృష్ణ అన్నారు. సోమవారం జ్యోతి థియేటర్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా ఆయన పర్యటించారు. టీ దుకాణాల వద్ద, ఇతర వ్యాపారులతో మమేకయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ ఐదేళ్లపాలనలో రాష్ట్రంలో 20 ఏళ్ల వెనక్కి వెళ్లిపోయిందన్నారు. తిరిగి అభివృద్ధి సాధించాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. విశాఖ నగర అభివృదికి కట్టుబడి పనిచేస్తామన్నారు. వైసీపీ అధినేత, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎన్ని డ్రామాలు ఆడినా నేడు ప్రజలు నమ్మే స్థితిలో లేరని వంశీ అన్నారు. ఎన్నికల్లో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

41వార్డులో జనసేనలో భారీ చేరికలు

గ్రేటర్ 41వార్డు జ్ఞానాపురం, సబాస్టియన్ కాలనీ పలువురు, యువత మహిళలు జనసేన పార్టీలో చేరారు. వంశీ కృష్ణ నాయకత్వంపై విశ్వాసంతో వార్డులోని వార్డు జనసేన నాయకులు అంతోని శేఖర్ ఆధ్వర్యంలో 250 మందికి పైగా పార్టీలో చేరారు. వీరందరికీ కండువాలు వేసి వంశీకృష్ణ పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా వర్షాకాలంలో ఏటా ముంపునకు గురవుతున్న సెబాస్టియన్ కాలనీ సమస్య పరిష్కరించాలని కోరారు. గత పదేళ్లుగా వార్డులో ఎమ్మెల్యే వాసుపల్లి ఏ మాత్రం అభివృద్ధి చేయలేదని వారు తెలిపారు. కార్యక్రమంలో వార్డు జనసేన నాయకులు గవర రమణ, ఆశాజ్యోతి, సునీత, విజయకుమార్, రామారావు, చక్కాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచకాలకు చరమగీతం పలకాలి

పూర్ణామార్కెట్: వైసీపీ ఆరాచక పాలనకు చరమగీతం పాడాలని కూటమి అభ్యర్థి వంశీ కృష్ణయాదవ్ పిలుపు నిచ్చారు. సోమవారం సాయంత్రం గ్రేటర్ 35వ వార్డు వెలంపేట పోస్టాఫీసు నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో దక్షిణం నుంచి పోటీ తన గుర్తు గ్లాస్, ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న శ్రీభరత్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. వంశీ కృష్ణకు పలు వీధుల్లో మహిళలు హారతుల పట్టారు. యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఏడీసీ పార్కుల సందర్శన



వాకర్స్‌తో మాట్లాడుతున్న ఏడీసీ విశ్వనాథన్

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 15: అక్కయ్యపాలెం నాలుగు లేన్ల రహదారి బస్టాప్ పక్కనే ఉన్న గ్రీన్ బెల్ట్‌లో ఏర్పాటు చేసిన పిల్లల పార్కు, ఓపెన్ జిమ్‌ను జీవీఎంసీ అదనపు కమిషనర్ (ఏడీసీ) కేఎస్ విశ్వనాథన్ సోమవారం సందర్శించారు. ఈ మేరకు పార్కులో వాకింగ్ చేస్తున్న వారు జిమ్ లో పరికరాలు సరిగ్గా పని చేయడం లేదని, ట్రాక్ ఎగుడుదిగుడుగా ఉం దని ఏడీసీ దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

ఎన్నికల విధులపై సమావేశం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 15: సెక్టోరల్ అధికారులు, ఎన్నికల సూపర్‌వైజర్, బూత్‌స్థాయి అధికారులతో ముస్లిం తాటిచెట్లపాలెంలోని షాదీ ఖానాలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ మేరకు 12డీ హోం ఓ టింగ్, పోస్టల్ బ్యాలెట్, ఎన్నికల విధులపై ఉత్తర నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.అఖిల, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహశీల్దార్ జి.శ్రీరామమూర్తి చర్చించారు.

వైసీపీ పాలనలో అన్ని రంగాలు నాశనం

▸▸ ఉత్తర నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు



ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు

మర్రిపాలెం, ఏప్రిల్ 15: రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నదే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి లక్ష్యమని ఉత్తర నియోజకవర్గ కూటమి అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు అన్నారు. సోమవారం 53వ వార్డు పరిధి శ్రీరామ్‌నగర్, నరేంద్రనగర్, పార్వతీనగర్, శివనగర్ తదితర కాలనీల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మా ట్లాడుతూ ప్రస్తుత వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి జర గలేదన్నారు. అన్ని రంగాలను సర్వనాశనం చేశారని ధ్వజమెత్తారు. పాలన సాగించడంలో విఫలమైందని ఈసందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈస్థితిలో టీడీపీ, జనసేన, బీజేపీలు ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పలుసంక్షేమ పథకాలు అమలు చేయడంతోపాటు పేద, బడుగు, బలహీనవర్గాల అభివృద్ధే ధ్యేయంగా పలు చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్లు మంచి ఆలోచనతో బాధ్యతాయుతంగా ఓటు వేయాలన్నారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పని చేసే చంద్రబాబునాయుడును, అంకితభావంతో శ్రమిస్తున్న పవన్‌కల్యాణ్‌ను, దేశ ప్రజల అభివృద్ధిని కాంక్షిస్తున్న ప్రధాని నరేంద్రమోదీలకు మద్దతుగా కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ విశాఖ పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ పొలమరశెట్టి నర్సకుమారి, జనసేన నాయకుడు రఘు, అధికసంఖ్యలో మూడు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ విజేతలు ఇంజనీరింగ్, సీ అండ్ డబ్ల్యూ



విజేతగా నిలిచిన మహిళల సివిల్ ఇంజనీరింగ్ జట్టు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఏప్రిల్ 15: వాల్తేరు రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ నిర్వహిస్తున్న స్పోర్ట్సు మేళా లో భాగంగా డివిజనల్ అం తర్ శాఖల వెయిట్ లిఫ్టింగ్ టోర్నీ మహిళల విభాగంలో సివిల్ ఇంజనీరింగ్, పురుషుల కేటగిరిలో క్యారేజ్ అండ్ వ్యాగన్స్ (సీ అండ్ డబ్ల్యూ) చాంపియన్లుగా నిలిచాయి. స్వర్ణ పతకాలు సాధించిన వారిని పలువురు అభినందించారు.

'యూసీడీ పీడీపై చర్యలు లేకపోవడం దారుణం'

సీతమ్మధార, ఏప్రిల్ 15: అనేక అవతకలకు పాల్పడుతున్న జీవీఎంసీ అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ (యూసీడీ) విభాగం పీడీ పాపునాయుడుపై చర్యలు తీసుకోకపోవడం దారుణమని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అన్నారు. ఆయన పౌర గ్రంథాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యూసీడీని వైసీపీ జేబు సంస్థగా మార్చి పరువు తీసిన పాపునాయుడుపై విచారణ జరిపిన అధికారులు అసలు దొంగను వదిలేసి కింది స్థాయి వారిని బలి చేశారన్నారు. ఎక్సైజ్ శాఖ నుంచి నిబంధలకు విరుద్ధంగా డిప్యుటేషన్‌పై జీవీఎంసీ యూసీడీ పీడీగా వచ్చిన పాపునాయుడు ఎన్నికల నిబంధనలను ఖాతరు చేయకుండా బరితెగించి వైసీపీ అభ్యర్థుల సేవల్లో మునిగి తేలుతున్నారన్నారు. దీనిపై ఫిర్యాదులు అందినా, నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ఉన్నతాధికారులు ఇంకా వైసీపీ నేతల ఒత్తిడికి లొంగి పాపునాయుడును కాపాడుతూ వస్తున్నారని ఆరోపించారు.

మంత్రి బొత్సకు 'అప్సా' ప్రతినిధులు వినతి

కంచరపాలెం, ఏప్రిల్ 15 : ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాల (అప్సా) ప్రతినిధులు విద్యాశాఖా మంత్రి బొత్ససత్యనారాయణను సోమవారం ఆయన నివాసంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. బదిలీ సర్టిఫికెట్, స్టడీసర్టిఫికెట్ లేకుండా ఎవరూ ఏ స్కూల్లో నైనా అడ్మిషన్ పొందవచ్చునని ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ ఇచ్చిన జీవో ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలకు నష్టం కలిగేవిధంగా ఉందని ఈసందర్భంగా ఆయన దృష్టికి తెచ్చారు. మంత్రి స్పందించి ఎవరికీ ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యాశాఖ మంత్రిని కలిసినవారిలో అప్సా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు కె.రామకృష్ణ, పి.భాస్కరరావుతో పాటు ఇతర ప్రతినిధులు ఉన్నారు.

మోసగించడంలో జగన్‌రెడ్డి ఘనుడు: గండిబాబ్జీ



ప్రచారం చేస్తున్న గండి బాబ్జీ

సీతమ్మధార, ఏప్రిల్ 15: ప్రజలను మోసగించడంతో ఘనుడు ముఖ్యమం త్రి జగన్‌రెడ్డి అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ విమర్శించారు. సోమవారం ఉత్తర నియోజకవర్గం బాలయ్య శాస్త్రి లే అవుట్ పరిసర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి లోక్‌సభ అభ్యర్థి శ్రీభరత్‌కు చెందిన సైకిల్‌పై, శాసనసభకి విష్ణుకుమార్ రాజు కమలం పూవు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. కూటమి అభ్యర్థుల విజయంతోనే సురక్షితమైన సాధ్యమన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతున్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే విష్ణుకుమార్‌రాజు, శ్రీభరత్‌లను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక, కార్పొరేటర్ ముక్కా శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు- గువాహటి ప్రత్యేక రైలు

విశాఖపట్నం, ఏప్రిల్ 15: వేసవి ప్రయాణికుల సౌకర్యార్థం వయా దువ్వాడ మీదుగా బెంగళూరు, గువాహటి మధ్య ప్రత్యేక రైలు ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. 06521 నంబరు గల రైలు ఈనెల 16 నుంచి జూన్ 25 వరకు ప్రతి మంగళవారం రాత్రి 11.40 గంటలకు బెంగళూరులో బయలుదేరి మర్నాడు సాయంత్రం 6.18 గంటలకు దువ్వాడ, శుక్రవారం ఉదయం 4.50 గంటలకు గుహవటి చేరుతుంది. తిరిగి రైలు ఈనెల 20 నుంచి జూన్ 29 వరకు ప్రతి శనివారం ఉదయం 6.15 గంటలకు గుహవటిలో బయలుదేరి ఆదివారం మధ్యాహ్నం 3.08 గంటలకు దువ్వాడ, సోమవారం ఉదయం 10.55 గంటలకు బెంగళూరు చేరుతుంది.


నవ్వులే..నవ్వులు!

▸▸ నేడు ప్రపంచ ప్రఖ్యాత హాస్యనటులు చార్లీచాప్లిన్ జయంతి

▸▸ నగరంలో ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రదర్శనలు



సైలెన్స్ ప్లీజ్ స్కిట్‌లో...నవ్వులు..పూయిస్తున్న నటులు



చాప్లిన్ వేషధారణలో సుబ్రహ్మణ్యం

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 15: అతను నవ్వుకు శాశ్వత చిరునామా. దర్శకుడు, నిర్మాత, విశ్వ విఖ్యాత నటుడు చార్లీ చాప్లిన్‌పై ఇలా ఎన్ని విశేషణాలు చెప్పినా తక్కువే.. పేదరికాన్ని పరిహాసం చేసి...నవ్వునేఆయుధంగా మలచిన ధీరుడు చార్లీ చాప్లిన్ 135వ జయంతి నేడు. ఈ సందర్భంగా ఆయన స్ఫూర్తితో హాస్యాన్ని పండిస్తున్న నగరానికి ఫ్రెండ్స్ కామెడీ క్లబ్‌పై కథనం..

నవ్వు నాలుగు విధాల మేలు అన్న సూక్తిని.. బలంగా నమ్మే వ్యక్తి...నగరానికి చెందిన విశ్రాంత బ్యాంకు మేనేజర్ ఎంవీ సుబ్రహ్మణ్యం. తనతోపాటు తనచుట్టూ ఉన్న ప్రతీ ఒక్కరూ కాసేపైనా... హాయిగా నవ్వుకునేలా ఏదైనా చేయాలని సంకల్పించారు. ఇందులో భాగంగా ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ పేరుతో దశాబ్ద కాలానికి పైగా రెండు వేలకుపైగా వివిధ ప్రదర్శనలిచ్చారు. విశాఖపట్నం, గోదావరిఖని, కరీంనగర్ , హైదరాబాద్ తదతర ప్రాంతాల్లో ప్రేక్షకులను తన నటనా ప్రతిభతో నవ్విస్తూ వస్తున్నారు. ఈ క్లబ్ ద్వారా హాస్యనాటికలు, చిన్న చిన్న స్కిట్స్..ప్రదర్శిస్తున్నారు. వీటిలో ప్రధానమైనవి..సైలెన్స్ ప్లీజ్..కవితా..ఐపీఎస్..సాంకేతిక లోపం..చార్లీచాప్లిన్ పాటిజివ్, సూపర్‌క్లాప్..ఊరికనే..ఏటీఎం..తదితర వాటి ఉన్నాయి..

ఆ స్కిట్స్‌కు సూటయ్యేలా.. వేషధారణ

సుబ్రహ్మణం...కేవలం స్కిట్స్ వేసి..ప్రేక్షకులను నవ్వించడమే కాకుండా ఆ స్కిట్‌కు తగ్గట్టుగా మేకప్ కావడం ఆయన ప్రత్యేకత. ఆయా స్కిట్స్‌కు సరిపడేలా...ఆయనతో పాటు బృందసభ్యులను తయారు చేసి మరింత రక్తికట్టించి ప్రదర్శన విజయవంతమయ్యేలా కృషి చేస్తూ ప్రేక్షకుల మన్ననలు పొందుతున్నారు.

ఔత్సాహిక కళాకారుల ప్రతిభ వెలికితీయడమే లక్ష్యం..

▸▸ ఎంవీ సుబ్రహ్మణ్యం...

ఔత్సాహిక కళాకారులను వెలికితీయేడం.. ప్రదర్శనల ద్వారా ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడమే నా ధ్యేయం.. ఇది ఎంతో కష్టమైనప్పటికీ ఆ దిశగా సాగాను. కాశీ విశ్వనాథ్‌తో చర్చించి 2012 లో ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ నెలకొల్పాను. అప్పటి నుంచి ప్రతి నెలా ప్రదర్శనలు ఇస్తున్నాం. వృత్తిరీత్యా రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ కావడంతో ప్రదర్శనలకుఅయ్యే ఖర్చులన్నీ నేను భర్తిస్తున్నా. కళాకారులను జనానికి పరిచయం చేయడం. హాస్యగుళికలను అందించంలో ఎంతో సంతృప్తిఉంది.

బస్సెక్కితే బాదుడే

... 5వ పేజీ తరువాయి

భారంగా పరిణమించింది. ఆదాయమే పరమావధిగా జగన్ ప్రభుత్వం చార్జీలను భారీగా పెంచడంతో వారిపై అదనపు భారం పడింది. నగర పరిధిలోని వివిధ రూట్లలో తిరిగే సిటీబస్సులతోపాటు ఉత్తరాంధ్రలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రూట్లలో తిరిగే ఎక్స్‌ప్రెస్, లగ్జరీ బస్సుల చార్జీలను 2019తో పోల్చితే 25 శాతం నుంచి గరిష్ఠంగా 50 శాతం వరకూ పెంచారు.

ప్రయాణికులపై భారం ఇలా...

ద్వారకాబస్‌స్టేషన్ నుంచి చోడవరం ప్రయాణానికి 2019 లో చార్జీ రూ. 55 ఉండగా ఇప్పుడు రూ.75, నర్సీపట్నానికి 2019లో రూ.105 ఉండగా ప్రస్తుతం రూ.150, విజయనగరానికి 2019లో రూ.60 ఉంటే ప్రస్తుతం రూ.90, పార్వతీపురానికి రూ.170 ఉంటే ప్రస్తుతం రూ.220, శ్రీకాకుళానికి రూ.150 ఉంటే ప్రస్తుతం రూ.175, పాలకొండకి రూ.150 నుంచి రూ.185కి, అనకాపల్లికి రూ.50నుంచి రూ.60, సబ్బవరం రూ.30 నుంచి రూ.40, కొత్తవలస రూ. 25 నుంచి రూ. 35, ఎలమంచిలి రూ.60 నుంచి రూ.85కి పెరిగిపోయాయి.

నగర వాసులపైనా వడ్డన

నగర పరిధిలో సింహాచలం వరకు 2019లో రూ.20 చార్జీ ఉండగా ప్రస్తుతం రూ.30, గాజువాకకి రూ.25 నుంచి రూ.35కి, భీమిలికి రూ.30 ఉంటే ప్రస్తుతం రూ.45 , కొమ్మాదికి రూ.20 నుంచి రూ.40, విశాఖ రైల్వేస్టేషన్ నుంచి తగరపువలస రూ.30 నుంచి రూ.45కి పెంచేశారు. దీనివల్ల ప్రయాణికులపై రూ.పది కోట్లు అదనపు భారం పడిందని అంచనా.

పెంపుపై సామాన్యుల ఆగ్రహం

ఆర్టీసీ బస్సు చార్జీలను ఐదేళ్లలో రెండుసార్లు ఏకంగా 50 శాతం మేరకు పెంచడంపై సామాన్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూలీలు, ప్రైవేటు ఉద్యోగులు, స్వయంసహాయక వృత్తుల్లో ఉన్నవారంతా అద్దెలు తక్కువగా ఉంటాయనే భావనతో నగర శివారు ప్రాంతాల్లో నివసిస్తారు. వారంతా పనుల కోసం నగరానికి నిత్యం బస్సుల్లోనే వచ్చిపోతుంటారు. వచ్చే కూలీ/ వేతనంలో చార్జీలకే ఎక్కువ మొత్తం కేటాయించాల్సిన పరిస్థితి ఎదురవుతోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పైగా ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) తక్కువగా ఉందనే కారణంతో పలు రూట్లలో బస్సులను రద్దుచేస్తున్నారని, దీనివల్ల ఆయా ప్రాంతాల వారికి ఆటోలే శరణ్యమవుతున్నాయంటున్నారు. ఆర్టీసీ చార్జీలను పెంచి ఆదాయం సమకూర్చుకోవాలనే వైసీపీ సర్కారు తీరును వారంతా తూర్పారబడుతున్నారు.

ఏలేరు పైప్‌లైన్ హుళక్కే!

... 5వ పేజీ తరువాయి

ప్రపంచబ్యాంకుతోపాటు ఇతర బ్యాంకుల నుంచి రుణాల ద్వారా మరిన్ని నిధులు సమకూర్చుకునేలా డీపీఆర్ తయారుచేసి మూడేళ్ల కిందట రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం లభించిన తరువాత టెండర్లు పిలుస్తామని అప్పటి జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ జి.లక్ష్మీషా ప్రకటించారు.

మూడేళ్లైనా అతీగతీ లేదు...

మూడేళ్లయినా ప్రాజెక్టుపై ఒక్క అడుగుకూడా ముందుకు పడలేదు. రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్‌ను ఆమోదిస్తున్నట్టుగానీ, సవరించాలని వెనక్కిపంపడం కానీ జరగలేదు. ఉద్యోగులకు ప్రతినెలా నిర్ణీత సమయానికి జీతాలు ఇవ్వడానికే ఆపసోపాలు పడుతున్న ప్రభుత్వం జీవీఎంసీలో నీటిసరఫరా మెరుగుపరిచేందుకు ఏకంగా రూ.3,494 కోట్లు వెచ్చిస్తుందంటే అధికారులు ఎలా నమ్మారని జీవీఎంసీకి చెందిన కొంతమంది సిబ్బందే ప్రశ్నిస్తుండడంతో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కే అవకాశాలే లేవని తేల్చి చెబుతోంది.

డిప్యూటీ సీఎంకు ఝలక్!

... 5వ పేజీ తరువాయి

పరిణామం వైసీపీకి షాక్‌గా భావిస్తున్నారు.

కిలపర్తి భాస్కరరావు తండ్రి కిలపర్తి సూరి అప్పారావు నియోజకవర్గంలో కీలకనేత. మాడుగుల అసెంబ్లీకి గతంలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేశారు. ఆయన మరణం తరువాత భాస్కరరావు రాజకీయాల్లోకి వచ్చారు. వైసీపీ తరపున దేవరాపల్లి ఎంపీపీగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో గట్టి పట్టున్న ఆయన.. కొద్దికాలంగా డిప్యూటీ సీఎంతో అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. వైసీపీ అధిష్ఠానం తొలుత బూడి ముత్యాల నాయుడుకు మాడుగుల అసెంబ్లీ టికెట్ కేటాయించింది. అనకాపల్లి నుంచిబీజేపీకి చెందిన సీఎం రమేశ్ బరిలో దిగడంతో.. బూడిని ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో మాడుగుల ఎమ్మెల్యే టికెట్ తనకు లభిస్తుందని కిలపర్తి భాస్కరరావు భావించినట్టు తెలిసింది. అయితే అనూహ్యంగా బూడి కుమార్తె ఈర్లె అనూరాధకు కేటాయించడంతో భాస్కరరావు తీవ్ర నిరాశ చెందారు. అంతకు ముందు వరకు ఉప ముఖ్యమంత్రి దేవరాపల్లి మండలంలో ఏగ్రామంలో పర్యటించినా భాస్కరరావు వెంట వుండేవారు. మాడుగుల టికెట్‌ను అనూరాధకు కేటాయించినప్పటి నుంచి కనిపించడంలేదు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా వుంటున్నారు. డిప్యూటీ సీఎం ఫోన్ చేసినా ఎత్తడంలేదని తెలిసింది. భాస్కరరావు పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేలా డిప్యూటీ సీఎం ప్రయత్నాలు చేసినప్పటికీ, స్పందన లేదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కిలపర్తి భాస్కరరావు వ్యవహారంపై ఆదివారం రాత్రి మండలానికి చెందిన పార్టీ ముఖ్యనేతలతో డిప్యూటీ సీఎం బూడి ప్రత్యేక సమావేశం నిర్వహించినట్టు సమాచారం. భాస్కరరావును బుజ్జగించే ప్రసక్తే లేదని, అతనికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చినా తనను మోసగించారంటూ డిప్యూటీ సీఎం వ్యాఖ్యానించినట్టు చెబుతున్నారు. అతనితో తెగతెంపులు చేసుకుంటామని స్పష్టం చేసినట్టు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న కిలపర్తి భాస్కరరావు, తన భార్య రాజేశ్వరిని వెం టబెట్టుకుని సోమవారం విశాఖ వెళ్లి జడ్పీ సీఈవో ఎం.పోలినా యుడును కలిశారు. రాజేశ్వరి ఎంపీపీ పదవికి రాజీనామా చేస్తూ, లేఖను ఆయనకు అంద జేశా రు. ఆరోగ్యం సహకరించక రాజీనామా చేస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. కాగా ఎంపీటీసీ పదవికి, వైసీపీకి రాజీనామా చేయలేదని భాస్కరరావు, రాజేశ్వరి చెప్పారు.

చరిత్ర పుటల్లో... నేషనల్ హిస్టరీ పార్క్

... 5వ పేజీ తరువాయి

కాపులుప్పాడలో నేషనల్ హిస్టరీ పార్కు కోసం 15 ఎకరాల భూమిని కేటాయించారు. దీనికి ఏపీ నేచురల్ హిస్టరీ పార్క్ అండ్ మ్యూజియం(ఎన్‌హెచ్‌పీఎం) అని నామకరణం చేశారు. ఆ మార్గంలో బోర్డు కూడా పెట్టారు. దీని నిర్మాణ బాధ్యతలను 'నేచురల్ హిస్టరీ సొసైటీ ఆఫ్ ఇండియా'కు అప్పగించారు. ప్రాజెక్ట్ మంజూరైన వెంటనే శాస్త్రవేత్తలు ఎక్కడెక్కడి నుంచో అరుదైన రాళ్లు (శిలాజాలు)ను తీసుకువచ్చి ప్రదర్శనకు పెట్టారు. దేశంలో విభిన్న ప్రాంతాలు, వాతావరణాల్లో పెరిగే మొక్కలు, అడవుల్లో లభించే వృక్షాలు, సముద్రాల్లో దొరికే శిలాజాలు, పర్వత శ్రేణుల్లో కనిపించే జీవరాశులు, ఎడారుల్లో అరుదుగా కనిపించే చెట్లను ఇక్కడ పెట్టాలనేది ధ్యేయం. విద్యార్థులకు విజ్ఞానాన్ని పంచేదిగా, కొత్త ఆలోచనలు రేకెత్తించేలా తీర్చిదిద్దాలనే సంకల్పంతో పనులకు శ్రీకారం చుట్టారు. విశాఖపట్నానికి ఇది పర్యాటక పరంగా అదనపు ఆకర్షణ అవుతుందని భావించారు.

లోగో తయారీకి పోటీ...

ప్రకృతికి, చరిత్రను ముడిపెడుతూ దేశంలో ఏర్పాటవుతున్న తొలి మ్యూజియం కావడంతో దీనికి లోగో తయారు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం పత్రికల్లో ప్రకటన ఇచ్చి డిజైన్లు ఆహ్వానించారు. 'ఆంధ్రప్రదేశ్ నేషనల్ హిస్టరీ పార్క్, మ్యూజియం అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఏపీఎన్‌హెచ్‌పీ ఎంఅండ్ఆర్ఐ)ను తలపిస్తూ అర్థవంతంగా ఉండేలా డిజైన్ కావాలని కోరారు. వివిధ రాష్ట్రాల నుంచి 127 డిజైన్లు రాగా వాటిని ఆంధ్ర విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ విభాగానికి పంపి ఎంపిక చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఆర్ట్ డైరెక్టర్ రమేశ్ రూపొందించిన డిజైన్‌ను లోగోగా ఎంపిక చేశారు.

పార్కులో 65 మిలియన్ సంవత్సరాల నాటి డైనోసార్‌ల నుంచి ప్రపంచంలో వింతైన జంతువుల వరకు అన్నింటి నమూనాలు పెట్టి ఎవల్యూషన్ పార్క్‌గా మార్చాలనుకున్నారు. సీతాకోక చిలుకలు సహజ వాతావరణంలో జీవించేలా ఎన్‌క్లోజర్లు ఏర్పాటు చేసి, 25 రకాలు పెంచాలని భావించారు. పదివేల సంవత్సరాల నాటి సముద్ర జలరాశులకు చెందిన శిలాజాలు, దేశంలో వివిధ గనుల నుంచి విలువైన స్టోన్స్, క్రిస్టల్స్, మినరల్స్ తేవాలని నిర్ణయించారు. అరుదైన ఔషధ మొక్కలు, సువాసనలు వెదజల్లే పుష్పాలు, ఆర్కిడ్స్ వేయాలనుకున్నారు. కృత్రిమ జలాశయాన్ని ఏర్పాటు చేసి, రమణీయంగా తీర్చిదిద్దాలని ప్లాన్ చేశారు. మ్యూజియంలో ప్రత్యేకంగా గ్యాలరీలు పెట్టి, ఆడియో, వీడియో ద్వారా వాటిపై అవగాహన కల్పించాలనుకున్నారు. విద్యుత్‌ను ఎన్ని రకాలుగా తయారు చేస్తారో.. ప్రాక్టికల్‌గా చూపించాలనుకున్నారు. కానీ ఒక్కటీ రూపుదాల్చలేదు.

ట్రస్ట్‌బోర్డులో చర్చించాకే నిర్ణయం

పార్క్‌కు సంబంధించి వీఎంఆర్‌డీఏ తరపున డీపీఆర్ రూపొందించి, రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాం. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఎన్‌హెచ్‌పీఎం ట్రస్టు బోర్డులో దీనిపై చర్చించి గ్రీన్‌సిగ్నల్ లభించాకే కేంద్ర ప్రభుత్వానికి పంపాల్సి ఉంటుంది. అయితే ఇంకా ట్రస్టుబోర్డు సమావేశం కాలేదు. ఎప్పుడైతే అప్పుడు పంపుతామని వీఎంఆర్‌డీఏ అధికారి తెలిపారు.



ఏడో వార్డులో స్వాగతం పలుకుతున్న స్థానికులు



టీడీపీలో చేరిన ముత్తంశెట్టి అనుచరుడు పెద ఎర్రునాయుడు

జగన్ డ్రామాలను ప్రజలు నమ్మడం లేదు : గంటా

పద్మనాభం (రూరల్) : రాష్ట్ర ప్రజలు జగన్ డ్రామాలను నమ్మే స్థితిలో లేరని భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాస రావు అన్నారు. సోమవారం ఆయన పద్మనాభంలో విలేకరులతో మాట్లాడారు. జగన్‌పై రాయితో దాడి వెనుక ఎన్నో అనుమానాలు ఉన్నాయని చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తులు సీఎంపై రాయితో దాడి చేస్తే భద్రతా సిబ్బంది ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. నిజంగా రాయితో దాడి జరిగితే సీఎంకి భద్రత ఇవ్వలేని డీజీపీ, ఇంటిలిజెన్స్ చీఫ్ తక్షణమే విధుల నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు.

ఏడో వార్డులో ఘన స్వాగతం

మధురవాడ : గంటా శ్రీనివాసరావుకు ఏడో వార్డు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. సోమవారం ఆయన వార్డులోని మానం ఆంజనేయనగర్, ఆర్టీసీ కాలనీ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రజలు అడుగడుగునా స్వాగతం పలికి హారతులు పట్టారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆలయాల్లో పూజలు చేశారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల అభిమానం ఇలానే కొనసాగితే లక్ష మెజార్టీతో గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, భీమిలి నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి సందీప్ పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక

భీమునిపట్నం : పద్మనాభం మండలానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు సోమవారం టీడీపీలో చేరారు. వారికి బీచ్‌రోడ్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో గంటా శ్రీనివాసరావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో భీమిలి ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపోటు పెద ఎర్రునాయుడు, తునివలస మాజీ సర్పంచ్ గులమద్ది మహేశ్వర రావు, అనంతవరం మాజీ సర్పంచ్ గొర్రెపోటు వరలక్ష్మి, తదితరులు వున్నారు. కాగా అవంతి శ్రీనివాసరావుకు అనుచరుడిగా వున్న ఎర్రునాయుడు పార్టీలో చేరడం పట్ల గంటా ఆనందం వ్యక్తం చేసారు. భీమిలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లీలావతి, మాజీ వైస్ ఎంపీపీ నందీశ్వర రావు,మాజీ ఎంపీపీ నగేష్ ఆధ్వర్యంలో వారు పార్టీలో చేరారు.



పెదజాలారిపేటలో వైసీపీ కార్యకర్తలతో కలిసి పాదయాత్ర చేస్తున్న సత్యనారాయణ

వైసీపీతోనే ప్రజలకు సుపరిపాలన

» తూర్పు నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

పెదవాల్తేరు, ఏప్రిల్ 15 : వైసీపీ పాలనతోనే ప్రజలకు సుపరిపాలన అందుతుందని తూర్పు నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. సోమవారం ఆయన వైసీపీ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మీ దాస్‌తో కలిసి పెదజాలారిపేట నుంచి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఐదేళ్లలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశామని చెప్పారు. వలంటీర్ వ్యవస్థను రద్దు చేయడమే చంద్రబాబునాయుడు లక్ష్యం అన్నారు. ఏ రోజైనా మీ పిల్లల భవిష్యత్తు గురించి చంద్రబాబు ఆలోచించారా అని ప్రశ్నించారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ జగనన్న సంక్షేమ పథకాలు ఆగలేదని గుర్తుచేశారు. అలాగే వార్డులో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేశామన్నారు. కుల మతాలకు అతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలు, పెన్షన్లు అందించామని చెప్పారు. వైసీపీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందించి సీఎం జగన్ పేదల హృదయాల్లో నిలిచిపోయారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వాడమోదుల గణేష్, పలు కార్పొరేషన్ డైరెక్టర్లు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

19 నుంచి పోలమాంబ ఉత్సవాలు

ఆరిలోవ, ఏప్రిల్ 15 : జీవీఎంసీ 9వ వార్డు సంజయ్‌గాంధీ కాలనీలో ఈనెల 19 నుంచి 23 వరకు పోలమాంబ అమ్మవారి ఉత్సవాలు జరగనున్నాయి. ఈమేరకు సోమవారం అమ్మవారి ఆలయ ఆవరణలో ఉడుపు రాట వేశారు. తొలుత మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ మాజీ చైర్‌పర్సన్ అక్కరమాని విజయ నిర్మల అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఆలయ ధర్మకర్త కంచుమూర్తి నాగరాజు మాట్లాడుతూ 40 ఏళ్ల నుంచి ఈప్రాంతంలో పోలమాంబ అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 19 నుంచి 23 వరకు జరిగే ఉత్సవాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఆలయ ప్రధాన అర్చకుడు ప్రతాప్ శ్రీతేజ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ఒమ్మి రాజు, కార్యదర్శి కె. తాతారావు, చీపురుపల్లి ఈశ్వరరావు, కంచుమూర్తి శ్రీనివాసరావు, ఎం.సీతారామ్, సీర అనంత్, కోడి బోయిన అప్పలరాజు, శంకర్ పాల్గొన్నారు.

మద్దిలో రాములోరి పెళ్లి రాట

పద్మనాభం, ఏప్రిల్ 15 : మండలంలోని మద్ది రామాలయంలో ఈనెల 17న జరిగే శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే సీతారాముల కల్యాణోత్సవాలను పురస్కరించుకొని సోమవారం పెళ్లి రాట ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయ పురోహితుడు సామవేదం సీతారామయ్య ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, నవగ్రహారాధన తదితర కార్యక్రమాలు చేపట్టి సీతారాముల పెళ్లి రాటను శాస్త్రోక్తంగా వేశారు. అనంతరం సీతారాములకు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కె.రాంబాబు, సర్పంచ్ సన్యాసమ్మ, సత్యనారాయణ దంపతులు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీను, స్థానికులు ప్రకాష్, సతనారాయణ, శ్రీను, కోటేశ్వరరావు, నారాయణరావు, అప్పలరాజు, సన్నిబాబు పాల్గొన్నారు.

12వ వార్డు పెదగదిలిలో..

ఆరిలోవ, ఏప్రిల్ 15 : జీవీఎంసీ 12వ వార్డు పెదగదిలిలో కృష్ణ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం శ్రీరామ నవమి వేడుకలు జరగనున్నాయి. ఈమేరకు సోమవారం ఉడుపు రాట వేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, గ్రామ అధ్యక్షుడు కోలా బంగారయ్య, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

మద్దిలపాలెం, ఏప్రిల్ 15 : జీవీఎంసీ 22వ వార్డులో టీడీపీ నాయకులు సోమవారం సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఆ పార్టీ విశాఖ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ నేతృత్వంలో ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు, ఎంపీ అభ్యర్థి శ్రీభరత్‌ను గెలిపించాలని కోరారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక అమలు చేయనున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దువ్వి స్వామి, ఒమ్మి అప్పారావు, పెసల శ్రీను, కోడి బోయిన ఆనంద్, పడగల డేవిడ్, రాజ్‌కుమార్, రవి, మిల్లు రాజు, పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారి మారు వారం

వెంకోజీపాలెం, ఏప్రిల్ 15 : జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో వేంచేసి ఉన్న నూకాంబిక అమ్మవారి మారు వారం పండుగ సోమవారం ఘనంగా జరిగింది. అమ్మవారికి ఆలయ అర్చకుడు వెంకటాచార్యులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఊరేగించి, అమ్మవారికి నీలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బుగత సత్యనారాయణ, కర్రి గౌరీ, నరేంద్ర, కె. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఐఎస్‌టీడీ వ్యవస్థాపక దినోత్సవం

వెంకోజీపాలెం, ఏప్రిల్ 15 : ఏయూలోని టీఎల్ఎన్ సభా మందిరంలో ఇండియన్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ విశాఖ చాప్టర్ ఆధ్వర్యంలో ఐఎస్‌టీడీ 54వ వ్యవస్థాపక దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ సంస్థ ప్రగతిని ప్రభావితం చేసే అంశాలు, నూతన విధానాల గురించి వివరించారు. ఐఎస్‌టీడీ జాతీయ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎస్. సాంబశివరావు మాట్లాడుతూ హెచ్ఆర్ నిపుణులకు గొప్ప వేదికగా ఇది నిలుస్తోందన్నారు.అనంతరం ఐఎస్‌టీడీ విశాఖ ప్రాంతీయ కేంద్రం చైర్మన్ డాక్టర్ ఓఆర్ఎంరావు నివేదికను సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవ కార్య దర్శి డాక్టర్ హేమ యడవల్లి, ప్రత్యేక అతిథి ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్ (ఫైనాన్స్) గణేష్ ఐఎస్‌టీడీ చాప్టర్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, ఏప్రిల్ 15 : వరాహలక్ష్మీనృసింహస్వామికి అర్జిత సేవల్లో భాగంగా నిత్య కల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు జరిపి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణక్రతువు జరిపారు. మంత్రపుష్పం కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు, అందజేశారు.



చంద్రంపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

అవినీతి లేని పాలన జగన్‌కే సాధ్యం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస,ఏప్రిల్ 15 : వైసీపీ ప్రభుత్వం వచ్చాకే రాష్ట్రంలో అవినీతి లేకుండా పాలన సాగుతుందని, మరోసారి తమ పరిపాలన కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని భీమిలి వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన జీవీఎంసీ రెండవ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు గతంలో పచ్చచొక్కాలకు మాత్రమే అందేవని, కానీ జగన్ హయాంలో అర్హత కలిగిన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందాయన్నారు. ఇక్కడ అమలు చేసిన సచివాలయ వ్యవస్థను మిగిలిన రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా కోరాడ అప్పలస్వామినాయుడు, మేడిశెట్టి రాంజీ ఆధ్వర్యంలో జనసేన పార్టీకి చెందిన మామిడి శివ, మామిడి కొండారావు, కోట్యాడ రవికుమార్, పాలకుర్తి శ్రీనివాసరావు, మామిడి నానాజీ, బత్తుల బంగారం, విజ్జపు కిరణ్‌కుమార్ తదితరులు వైసీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు కొప్పల రమేష్‌చిల్ల భాస్కరరెడ్డి, చిప్పాడ వెంకటేష్, రామారావు, సూరిబాబు, బంక సత్యం పాల్గొన్నారు.

రూ. 500 కోట్లతో అభివృద్ధి పనులు

మధురవాడ : భీమిలి నియోజకవర్గంలో ఐదేళ్లలో రూ. 500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఏడో వార్డు చంద్రంపాలెంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి వైసీపీ మేనిఫెస్టో పత్రాలు అందించారు. ఐదేళ్లలో తాను చేసిన అభివృద్ధిని చూసి రెండోసారి గెలిపించాలన్నారు. ప్రత్యర్థుల విమర్శలు పట్టించుకోనని, తాను చేసిన అభివృద్ధినే నమ్ముకున్నారని చెప్పారు. కాగా ముత్తంశెట్టికి చంద్రంపాలెం ప్రజలు ఘన స్వాగతం పలికారు. నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలివచ్చి బాణసంచా కాల్చారు.



వలందపేటలో స్థానికులకు కరపత్రాలు అందిస్తున్న ముత్తంశెట్టి



స్వాగత ద్వారాలు

కల్యాణోత్సవాలకు స్వాగత ద్వారాల ఏర్పాటు

సింహాచలం, ఏప్రిల్ 15 : సింహగిరిపై ఈనెల 19 నుంచి జరిగే అప్పన్న వార్షిక తిరు కల్యాణోత్సవాలకు వచ్చే భక్తులకు ఆహ్వానం పలుకుతూ దేవస్థానం ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. దేవస్థానం రెండవ టోల్‌గేటు వద్ద, గోపాలపట్నం పెట్రోల్ బంక్ కూడలి వద్ద, సింహగిరి ఘాట్‌రోడ్డు పాతటోల్ గేటు వద్ద వీటిని ఏర్పాటు చేసి, విద్యుత్ దీపాలంకరణ చేశారు. ఇవి భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

అప్పన్న పెళ్లికి ముత్యాలు కానుక

గోపాలపట్నానికిచెందిన వ్యాపారి అప్పన్న వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా తలంబ్రాల వేడుకలో వినియోగించడానికి అవసరమైన ముత్యాలను కానుకగా సమర్పించారు.స్వర్ణా జ్యువెలరీ సంస్థకు చెందిన భక్తులు బాబు, వెంకన్న, సునీల్, బాలాజీ సుమారు రూ.75 వేలు విలువ చేసే మంచి ముత్యాలను సోమవారం ఈఓ శ్రీనివాసమూర్తికి అందజేశారు.

ఆకట్టుకున్న లఘు నాటిక



వెంకోజీపాలెం, ఏప్రిల్ 15 : ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా అంబేడ్కర్ జీవిత చరిత్రపై సోమవారం లఘు నాటిక ప్రదర్శించారు. అంబేడ్కర్ జీవితాన్ని, నాటి పరిస్థితులను ఆవిష్కరించిన విధానం ఆకట్టుకుంది.



ఉత్సవానికి సిద్ధంగా ఉన్న రథం

అప్పన్న రథోత్సవానికి సన్నాహాలు

సింహాచలం, ఏప్రిల్ 15 : సింహగిరిపై ఈనెల 19న జరిగే వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరుకల్యాణోత్సవంలో అంతర్భాగమైన రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఈఓ శ్రీనివాసమూర్తి సారథ్యంలో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. 19న రాత్రి 8 నుంచి గంట పాటు రథోత్సవం జరగనుంది. ఈమేరకు అలనాటి రథాన్ని శుభ్రపరిచి, పలు రంగులతో శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. అలాగే రథోత్సవంలో రథ సారథ్యం వహించి ఆడపెళ్లివారిగా విధులు నిర్వహించే జాలరి కుల పెద్ద కదరి లక్ష్మణరావును దేవాలయ పర్యవేక్షణాధికారి పిళ్లా శ్రీనివాసరావు సోమవారం ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి స్వామివారి ప్రసాదాన్ని, ఆహ్వాన పత్రికను అందజేశారు. రథోత్సవం విజయవంతం చేయాలని కోరారు.

సీతారామాలయంలో సంక్షిప్త రామాయణ హవనం

సింహాచలం, ఏప్రిల్ 15 : సింహగిరిపై గంగధార సమీపంలో ఉన్న సీతారామస్వామి దేవళంలోసోమవారం సంక్షిప్త రామాయణ హవనం నిర్వహించారు. ప్రతి మాసంలో వచ్చే శ్రీరాముడి జన్మ నక్షత్రం పునర్వసునాడు లోక కల్యాణార్థం అన్న సంకల్పంతో రామాయణ హవనం చేయడం ఆనవాయితీ.ఈమేరకు సోమవారం రాములోరిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రభాతారాధనలు చేసిన తరువాత సీతా, లక్ష్మణ, హనుమలతో ఉత్సవ మూర్తులను ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆగమోక్తంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. ముందుగా సిద్ధం చేసిన హోమ కుండంలో అగ్నిప్రతిష్ఠాపన చేశారు. తరువాత రామాయణ సంక్షిప్త పఠనం, శ్రీరామ షడక్షరీ మంత్రాల పఠనంతో విశేష హవనాన్ని జరిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ సింగల శ్రీనివాసమూర్తి దంపతులు, స్థానాచార్యులు రాజగోపాల్, అర్చకులు ఐవీ పద్మహాస చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

వాకర్స్‌తో టీడీపీ అభ్యర్థుల సమావేశం



వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో సమావేశమైన ఎంపీ అభ్యర్థి శ్రీభరత్, ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి

సిరిపురం, ఏప్రిల్ 15 : పాండురంగాపురంలోని ఎన్టీఆర్ పార్కులో వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్, తూర్పు నియోజకవర్గ అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు సోమవారం సమావేశమయ్యారు. ఎన్నికల్లో తమను బలపరచాలని కోరారు. అసోసియేషన్ సభ్యులు పలు రంగాలకు చెందిన నగర ప్రముఖులు కావడంతో వారితో పలు అంశాలపై చర్చించారు. ఆయా రంగాల తీరుతెన్నులు ఎలా ఉన్నాయో తెలుసుకున్నారు. నగరాభివృద్ధికి అవసరమైన సలహాలు తీసుకున్నారు.

21వ వార్డులో వెలగపూడి ప్రచారం

సిరిపురం : తూర్పు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు సోమవారం 21వ వార్డులో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి జయహో బీసీ, చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** గోకుల్, శ్రీకన్య, మౌర్య (గోపాలపట్నం) హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), దుర్గ (మధురవాడ)
- **లవ్ గురు :** శారద, సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
- **శ్రీరంగనీతులు :** కిన్నెర, శ్రీ నరసింహ (గోపాలపట్నం),
- **ది ఫ్యామిలీ స్టార్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), శ్రీకన్య-1, హెవెన్, సీతారామయ్య (పరవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి),
- **టిల్లు స్క్వేర్ :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి,
- **భరతనాట్యం :** రమాదేవి, లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస), సుకన్య (గోపాలపట్నం)
- **ప్రేమలు :** వెంకటేశ్వర, లీలామహల్

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 22, టమాటా 18, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 26, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 38, బీరకాయలు 36, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 26, క్యాబేజ్ 26, క్యారేట్ 32, దొండకాయలు 20, బంగాళా దుంపలు 28, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 30, అల్లం (పాతది) 155, బరబటి 32,ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 28, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 200, కొబ్బరికాయ (పెద్దది) 23,బీన్స్ (పెన్సిల్) 50, ఆగాకర 90, పొటల్స్ 68, కీరదోస 26, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 30, చిలగడదుంపలు 30, కంద 60, దేముడు చిక్కుడు 62, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 45, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	419
విజయనగరం	423
శ్రీకాకుళం	423

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 105
ఫారం ధర	-- 125
విత్ స్కిన్	-- 220
స్కిన్‌లెస్	-- 230

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

ఆస్తి పన్ను చెల్లింపుపై ఐదు శాతం రాయితీ

వెంకోజీపాలెం, ఏప్రిల్ 15 : జీవీఎంసీకి సంబంధించి ఆస్తి, ఖాళీ స్థలాల పన్నును ఈనెలాఖరులోగా ఏక మొత్తంగా చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ ఇవ్వనున్నట్టు కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పన్ను చెల్లింపునకు జీవీఎంసీ పరిధిలోని అన్ని సౌకర్యం కేంద్రాలను అందుబాటులో ఉంచుతున్నామని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆకట్టుకున్న చిత్ర కళా ప్రదర్శన

వెంకోజీపాలెం, ఏప్రిల్ 15 : శివాజీపాలెంలోని ఏయూ చిత్ర కళా విభాగంలో సోమవారం ప్రపంచ చిత్ర కళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వైవిధ్యమైన కళారూపాలను పరిచయం చేస్తూ నగరానికి చెందిన చిత్రకారుడు మోకా విజయ్ కుమార్ మిల్లెట్స్‌తో తీర్చిదిద్దిన కళారూపాలతో ప్రత్యేకప్రదర్శన ఏర్పాటు చేశారు. దీన్ని ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ. నరసింహారావు ప్రారంభించారు.చిత్రకారుడు విజయ్‌కుమార్ కృషిని అభినందించారు. అనంతరం చిత్రకళా విభాగాధిపతి సింహాచలం, తదిత రులు విజయ్‌కుమార్‌ను సత్కరించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

తగరపువలస, ఏప్రిల్ 15 : తగరపువలస కూడలిలో అగ్నిమాపక సిబ్బంది సోమవారం అగ్ని ప్రమాదాల నివారణపై స్థానికులకు అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఏవిధంగా వాటిని నివారించాలో పలు విన్యాసాల ద్వారా వివరించారు. కార్యక్రమంలో చిట్టివలస అగ్నిమాపక కేంద్రం అధికారి జి. శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

డైట్‌లో ప్రపంచ కళా దినోత్సవం

భీమునిపట్నం, ఏప్రిల్ 15 : ఉపాధ్యాయులు బోధనలో కళాత్మక మెలకువలు జోడిస్తే మరింతగా సత్ఫలితాలు సాధించవచ్చని డైట్ కళాశాల సీనియరు లెక్చరర్ ఎల్. సుధాకర్ అన్నారు. సోమవారం ఆ కళాశాలలో ఆర్ట్ లెక్చరర్ పేట హరిణి ఆధ్వర్యంలో ప్రపంచ కళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు కళలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. ప్రముఖ చిత్రకారుడు లియనార్డో డావెన్సీ జన్మదినాన్ని ప్రపంచ కళా దినోత్సవంగా జరుపుకొంటున్నామని తెలిపారు. ఆయన వేసిన చిత్రాలు ప్రపంచ చరిత్రను బోధించేలా వుంటాయన్నారు. అనంతరం ఛాత్రోపాధ్యాయులు తయారు చేసిన కళారూపాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్. త్రినాథరావు, ఎం. మహాలక్ష్మి, జె. మాధవి, గొట్టేటి రవి, తదితరులు పాల్గొన్నారు.